లేజర్ చికిత్స
- అత్యంత అధునాతన లేజర్ పరికరంతో చిగుళ్ల వ్యాధికి ప్రత్యేక చికిత్స.
- 7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు రీయంబర్స్‌మెంట్ సదుపాయం కలదు.
డాక్టర్ అబూరు స్వరూపకుమార్‌రెడ్డి, M.D.S.
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పాగతోట, నెల్లూరు. ఫోన్ : 2303300.

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షైము

సంపుటి: 82 • సంచిక: 43 • 19-10-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

Hotel D.S.R Paradise

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

ముఖ్యమంత్రిగా కిరణ్ పదవి పదిలం!

కలిసొచ్చే కాలం వస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడన్నట్లుగా వుంది ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ జాతకం. నెల రోజుల క్రితం వరకు ఆయన పదవి తుమ్మితే వూడే ముక్కు వలె కన్పించింది. కొత్త నాయకుడిగా ఎవరొస్తారనే చర్చ తప్ప ఆయన కొనసాగింపు మీద ఎవరికీ ఆశ లేదు. కానీ అప్పటి నుంచి పరిస్థితులన్నీ విచిత్రంగా కిరణ్‌కుమార్‌రెడ్డికి అనుకూలంగా మారాయి. రిటైల్ రంగంలో ఎఫ్‌డిఐలకు అనుమతి, గ్యాస్ ధరల పెంపకంతో కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం అస్థిరత్వం పాలు కావడం కిరణ్ అదృష్టాలలో మొదటిది. మమతా బెనర్జీ, కరుణానిధి, శరద్‌పవార్, మాయావతి, ములాయం వంటి వారంతా ప్రభుత్వాన్ని పడగొడతామని బెదరింపు ధోరణికి దిగడంతో కేంద్ర నాయకులకు తమ ఇళ్లు చక్కదిద్దుకోవడానికే పుణ్యకాలం చాలలేదు. దానితో కిరణ్ స్థానచలనం వాయిదా పడింది. ఈ లోగా కేజ్రీవాల్ సోనియాగాంధీ అల్లుడి మీద అవినీతి నిరోధక అణ్వాస్త్రం పేల్చాడు. దాని ధాటికి సోనియాతో సహా అధిష్టానం పెద్దలందరికీ దిమ్మ తిరిగిపోయింది. ఆ బురద కడుక్కోవడం ఎట్లనో అర్థం కాక తలలు పట్టుకొని వున్నారు వారు. పులి మీద పుట్ర వలె విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ మీద కూడా అవినీతి ఆరోపణ చేశాడు కేజ్రీవాల్.

అధిష్టానం తన వూసెత్తే పరిస్థితిలో కూడా లేదని అర్థమై పోవడంతో కిరణ్‌కుమార్‌రెడ్డి తన స్థానాన్ని పదిల పరచుకోవడానికి సన్నాహాలు చేసుకొంటున్నాడు. సెప్టెంబర్ 30తేది తెలంగాణ కవాతును సమర్థవంతంగా ఎదుర్కొన్నాడన్న మంచిపేరు ఢిల్లీలో ఆయన పట్ల కొంత సానుకూలత పెంచింది. ఒక దాని వెంట మరొకటిగా పరిస్థితులు కలిసి వచ్చి కుర్చీ భద్రంగా మారిపోయింది.

ఇప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డిలో పదవి పోతుం

కొరవ 14వ పేజీలో

ఎచ్చేసిందొచ్చేసిందోచ్!
అమ్మానాన్నలకు తప్పకుండా! రండి. చూడండి. నిర్ణయించండి.
ప్రభవ
2వ టర్మ్ అడ్మిషన్లు ప్రారంభం
మన పిల్లల తొలి బడి!
ప్లేక్లాస్ + LKG + UKG
టాడ్లర్ కేర్
మూడేళ్ల లోపు పిల్లలకు పరిమిత నీట్లు కలవు.
మూడేళ్ల నుండి ఆరేళ్ల పిల్లల బడి
The School for Three to Sixers!
పాగతోట, నెల్లూరు - 524001. ఫోన్ : 2333767, 94935 81278

శుభాకాంక్షలు

శ్రీ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, M.Sc., M.Phil.,
కరస్పాండెంట్, శ్రీ చంద్రారెడ్డి డిగ్రీకళాశాల, నెల్లూరు.
మా శ్రేయోభిలాషి, శ్రీ చంద్రారెడ్డి డిగ్రీకళాశాల కరస్పాండెంట్
శ్రీ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డిగారు విక్రమ సింహపురి యూనివర్శిటీ
పరిధిలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ, పిజి కళాశాలల సంఘం అధ్యక్షులుగా
ఎన్నికైన శుభసందర్భముగా వారికి మా హృదయపూర్వక శుభాభినందనలు.
D.RamanaReddy, Zonal Incharge, Narayana Group.
B. Venkata RamiReddy, Dist. Distributor, Pepsi.
M.Madhu Sudhan Reddy, Vice Principal, Sri Chandra Reddy Degree College.
G.V.A Sekhar Reddy, Chemistry Lecturer, Narayana Group.

అవార్డు గ్రహీతకు శుభాభినందనలు

వాస్తుశాస్త్రంలో పేరు ప్రఖ్యాతులు గడించి,
వాస్తులో రాజీలేని సలహాలను ఇస్తున్న
మా శ్రేయోభిలాషి
శ్రీ కస్తూరి లీలామోహన్‌రెడ్డి గారికి
తేది 18-10-2012 హైదరాబాదులోని
శ్రీ వైష్ణవి థియేటర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన
దసరా పురస్కార మహోత్సవంలో
జ్ఞానవీర్ అవార్డు గ్రహీత, పద్మభూషణ్
డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి
చేతులమీదుగా
దసరా పురస్కారం మరియు
సన్మానం జరిగిన
శుభ సందర్భంలో వారికి
మా హృదయపూర్వక
శుభాకాంక్షలు.
శ్రీ కస్తూరి లీలామోహన్‌రెడ్డి గారు
ప్రముఖ వాస్తు నిపుణులు, నెల్లూరు.

డాక్టర్లు మరియు సిబ్బంది
డాక్టర్ జి.కొండారెడ్డి సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
శంకరాగ్రహారం, బృందావనం, నెల్లూరు - 524001
ఫోన్ : 0861-2327235

తిరోగమనం

ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద కొత్తగా పెట్టాలను కొన్న పరిశ్రమలకు అప్పులు ఇవ్వరాదని బ్యాంకులన్నీ కలిసి నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తున్నది. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్థం కావడం వల్ల తాజాగా జరిగిన అనర్థం ఇది. పరిశ్రమ నడపడానికి తగిన కరెంట్ సరఫరా లేనప్పుడు పరిశ్రమ పెట్టి ఏమి లాభం అన్నది ఆర్థిక సంస్థల భావన. అది నిజం కూడా. ఇప్పుడున్న పరిశ్రమలే కరెంట్ కోతలతో ఒకదానివెంట మరొకటిగా ఖాయిలా పడి పోతున్నాయి. వారానికి మూడు రోజులు అధికారికంగా విద్యుత్‌కోత వుంది. కోతలేని దినాలలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కరెంట్ వాడకంపై నిషేధం విధించారు. నిరంతరం విద్యుత్ కావలసిన ఫర్నెస్‌లు, హీటర్లు, బాయిలర్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, డీప్ ఫ్రీజర్లు వంటి యంత్రాలు వాడే పరిశ్రమల వారు తలుపులేసుకోవడం ఉత్తమమనే నిర్ణయానికి వచ్చేశారు. ప్రత్యామ్నాయంగా జనరేటర్లు నెలకొల్పుకొనే స్థోమత అందరికీ వుండదు. ఒకవేళ వున్నా, పెరిగిన డీజిల్ ధరల వల్ల ఒక్క యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి 15 రూపాయల పైన ఖర్చవుతున్నది. ఆ అదనపు ఖర్చు పరిశ్రమల మీద పెనుభారమౌతున్నది. ఇతర దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులతో పోటీ పడలేక పోవడమే కాదు, ఇతర రాష్ట్రాల పరిశ్రమలతో కూడా పోటీ వీలు కావడం లేదు. వారంలో సగం రోజులు యంత్రాలను ఖాళీగా పెట్టవలసి రావడంతో, కార్మికులను భరించడం కూడా కష్టమైపోతున్నది. ఖాళీగా పెట్టి జీతాలిస్తే గిట్టుబాటు కాదు. జీతాలివ్వకుంటే కార్మికులకు పూట గడవదు. ఒక్క హైదరాబాదు నగరంలోనే గత ఆరు నెలల్లో దాదాపు రెండు లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని అంచనా. రాష్ట్రం మొత్తం మీద చూస్తే ఈ సంఖ్య ఎన్ని లక్షలు దాటుతుందో వూహించ లేము. కరెంట్ కోత వల్ల సకాలానికి తమ ఉత్పత్తులు సరఫరా చేయలేక పరిశ్రమలన్నీ ఆర్థికంగా చితికిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆర్థిక సంస్థలు పరిశ్రమలకు కొత్తగా అప్పులివ్వకూడదనే నిర్ణయం తీసుకోవడం సహేతుకమే. అయితే, ఈ పరిస్థితి మన రాష్ట్రాన్ని ఎక్కడకు తీసుక వెళ్తా యన్నదే ప్రశ్న. నిరంతర పారిశ్రామిక ప్రగతి కొనసాగిస్తే తప్ప ఏ దేశం కానీ, ఏ రాష్ట్రం కానీ ఆర్థికంగా ఉన్నతిని సాధించలేవు. ఉండే పరిశ్రమలే మూత పడే దుర్గతి ఎదురైతే పరిస్థితులు ఎంతగా వికటిస్తాయో వర్ణించలేము. శీఘ్ర పారిశ్రామికవృద్ధి లక్ష్యాలను అధిగమిస్తూ పక్కనున్న తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ వంటి రాష్ట్రాలు ప్రగతిరథంపై దూసుక వెళ్తుంటే మనం మాత్రం తిరోగమన బాటలో ప్రయాణం చేస్తున్నాము. ఎంతో దుర దృష్టకరమైన పరిణామం ఇది. ఇప్పటికే మన రాష్ట్రంలో నిరుద్యోగం వెయ్యి తలల విష సర్పం వలె విస్తరిస్తున్నది. బిటెక్ వంటి వృత్తి విద్యలు చదివిన వారికి తప్ప సాధారణ విద్యలో పట్టాలు తీసుకొన్న, తక్కువ చదువు చదివిన యువతీయువకులు చేయడానికి పని లేక నిరాశానిస్పృహలతో కుమిలి పోతున్నారు. కొత్త పరిశ్రమలు రాకుంటే కొత్తగా ఉద్యోగాలూ రావు. దానివల్ల సామాన్యుల ఆర్థిక పరిస్థితి చితికి పోవడమే కాదు, సామాజికంగా కూడా ఎన్నో సమస్యలు తలెత్తే ప్రమాదం వుంది.

కనీసం ఎప్పటిలోగా ఈ దుర్గతి తొలగే అవకాశం వుందో కూడా చెప్పలేని దౌర్భాగ్య దశలో వుంది రాష్ట్ర ప్రభుత్వం. కనీసం ఇప్పటికిప్పుడు యుద్ధ ప్రాతిపదికన కరెంట్ ఉత్పత్తి, సరఫరా మెరుగుపరిచే ప్రయత్నం మొదలుపెట్టినా దాని ఫలితాలు అందుబాటులోకి రావడానికి అధమపక్షం ఐదేళ్లు పడుతుంది. కానీ దురదృష్టవశాత్తు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ముఖ్యమంత్రి కానీ ఆ దిశలో చిన్న పాటి ప్రయత్నం కూడా చేయడం లేదు. కొత్త విద్యుత్ కర్మాగారాల స్థాపనకు ఆలోచన కూడా జరపడం లేదు. ప్రజలను గాలికి వదిలేసిన చందంగా వుంది ప్రభుత్వ వైఖరి. ఆ తీరు చూస్తుంటే కడుపు మండిపోతున్నది.

గ్యాస్ దొరకలేదని, వానలు పడలేదని కుంటిసాకులు చెప్పి కాలక్షేపం చేస్తే ఆంధ్రప్రదేశ్ కోలుకోలేని దుర్గతికి దిగజారిపోవడం ఖాయం. వాటిని పక్కనపెట్టి, విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకొని అయినా కొత్త థర్మల్ కేంద్రాలను అత్యవసర ప్రాతిపదికన నెలకొల్పడం ఒక్కటే తక్షణ పరిష్కారమార్గం. పాలనానుభవం లేని ముఖ్యమంత్రికి అది చేతకాకుంటే కేంద్రమైనా చొరవ తీసుకొని పరిస్థితిని చక్కదిద్దాలి.

జమీన్‌రైతు

జనవాక్కు

బియ్యం ధరలు పైపైకి!

రాష్ట్రంలో జూన్ – జులై మాసాల్లో క్వింటాల్ బియ్యం ధర 2,100 రూపాయల నుండి 2,200 రూపాయలుగా ఉండేవి. నెల రోజుల వ్యవధిలోనే ఈ ధర 3,200 రూపాలయ్యింది. ఒక్కసారిగా క్వింటాలుకు వెయ్యి రూపాయలు పెరిగింది. కిలో బియ్యం 36 రూపాయలుగా నెల్లూరు మార్కెట్‌లో అమ్ముతున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యాన్ని కొని ఆ తర్వాత బియ్యం ధరలను వ్యాపారస్తులు పెంచేశారు. రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సర్కారు పనిచేయడం లేదనే దానికి విపరీతంగా పెరిగిన బియ్యం ధరలే మంచి ఉదాహరణ. నిత్యావసరాలు, విద్యుత్ ఛార్జీలు ఇలా ఒకటేమిటి అన్నింటి ధరలు పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెన్న పాలు కావడం ఖాయం.

కె.హేమ — నెల్లూరు

నిజాం విగ్రహం వెక్కిరించలేదా?

గద్దర్ దళిత తెలంగాణ కావాలంటున్నారు. మరి దొరల చేతిలో ఉద్యమ నాయకత్వం ఉంది. తెలంగాణను వందలాది సంవత్సరాలు దోచుకున్నది రజాకార్లు, దొరలు. ప్రాణాలు పోగొట్టుకున్నది సామాన్యులు. విప్లవ నాయకురాలు విమలక్క మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయగా పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. తెలంగాణకు కాసు వ్యతిరేకి కాబట్టి మా గడ్డపై ఆయన విగ్రహం వెక్కిరించినట్లుందన్నారామె. 1970లో తెలంగాణ ఉద్యమాన్ని ఢిల్లీలో ఇందిరాగాంధీ దగ్గర అమ్మేశాడు మర్రి చెన్నారెడ్డి. కానీ వీరి విగ్రహాల జోలికి పోలేదు. తెలంగాణ ప్రజల చేత 'బాంచను దొరా నీకాల్మొక్తా' అని పించిన నిజాం విగ్రహం జోలికి విమలక్క పోలేదు. పద కవితా పితామహుడు అన్నమయ్య విగ్రహాన్ని రాయలసీమ వాసి అని ధ్వంసం చేశారు. అన్నమయ్య, బ్రహ్మానందరెడ్డిల విగ్రహాలు తెలంగాణలో ఉండకూడదు అనుకొంటే తెలంగాణ వాసులైన బూర్గుల రామకృష్ణారావు, మాడభూషి హనుమంతరావు, సురవరం సుధాకర్‌రెడ్డి, దాశరథి రంగాచార్య, సినారె, పోతన, దాశరథి, కాళోజి, విజయశాంతి స్మృతులు, రచనలు, సినిమాలు, కవితలు సీమాంధ్రలో మిగలకూడదు.

బండారి నరసింహులు — భువనగిరి

చంద్రబాబు పాదయాత్ర

పది కిలోమీటర్ల పాదయాత్ర చేస్తేనే ఒళ్లు హూనమవుతుంది. అటువంటిది చంద్రబాబు నాయుడు తన 63వ ఏట 117 రోజుల్లో 2340 కిలోమీటర్ల పాదయాత్రకు శ్రీకారం చుట్టడం అభినందనీయం. చంద్రబాబు హయాంలో చక్కని పాలన అందించాడు. లక్షల మంది పిల్లలకు ఉద్యోగాలొచ్చాయి. అవినీతికి దూరంగానే ఉండినాడు. అధికార యంత్రాంగాన్ని ఆయన నిద్రపోనివ్వ

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

27-10-1942
పేజీలు : 8 వెల: అణా

కనుపూరి చెర్వుకు ఏటి కాలువ!

మొత్తం ఎస్టిమేటు ఖర్చు 8 లక్షలు. రైతులు భరించవలసిన దామాషా 2,44,000. సర్కారు వారు పెట్టుబడి పెట్టవలసినది 5,56,000. ఎకరానికి 16 రూపాయల వంతున 15వేల ఎకరాలపైన ఖర్చులు వసూలు చేయవచ్చును. నీటిపారుదల కాదగిన చెర్వులు 30. సర్కారుకు నూటికి 4 రూపాయలు వడ్డీ రాగలదు.

సంగం ఆనకట్ట ఎడమ ప్రక్క నుండి ఒక యేటి కాలువను త్రవ్వి కనుపూరు చెరువులో కలిపితే నెల్లూరు తాలుకాలోని సుమారు 44 మెట్ట గ్రామాలు 10 సంవత్సరములలో 9 సంవత్సరములు నిస్సంశయముగా పంటలు పండించవచ్చునని 1940లో మన జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా నుండిన ఆంధ్రా ఇంజనీరు వేపా కృష్ణమూర్తి సహేతుకమైన అభిప్రాయం.

ఈ కాలువ విషయం ఈనాటిది కాదు. 1927లో ఇక్కడ డిప్యూటీ కలెక్టర్‌గా నుండిన గ్రబ్బుగారు దీనికి పునాది వేసినారు. అప్పుడు విచారణ కొంతవరకు జరిగి 13-9-30 తేదీన సూచించిన కాలువ దారి సంగం వద్ద నుండి నెల్లూరు చెరువు సప్లయి కాలువ గుండా కొంత వరకు వచ్చి వొడుంవాగులో కలిపి దక్షిణం తిరిగి పొదలకూరు తాడిపత్రి రోడ్డుకు పడమర పారి కందమూరుకు పడమర రస్తాదాటి యింకా దక్షిణం పోయి ఉప్పుటేరు దగ్గర తూర్పుగా మళ్లీ అంతట ఆమంచర్ల పడమరగా ప్రయాణం చేసి దక్షిణానికి తిరిగి కనుపూరు చెరువులో పడిపోవలెనని.

50 ఏళ్ల క్రితం ఈవారం

19-10-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

నెల్లూరు ముచ్చట్లు

రెండు రోజులలో 8 పదున్లు

చిత్తకార్తెలో వర్షం దంచికొడుతున్నది. 17వ తేది రాత్రి నుండి ఉరుములతో కుండపోతగా కురుస్తున్నది. ఈ రోజు(19వ తేది) గూడా ఎడతెరిపి లేదు.

17వ తేది రాత్రి నుండి 19వ తేది పగలు 11.30 గంటల వరకు మొత్తం షుమారు 8 పదున్ల వర్షం కురిసినట్లు కలెక్టరాఫీసు లెక్కలను బట్టి తెలుస్తున్నది. 13వ తేది నుండి 19వ తేది ఉదయం వరకు ఆనకట్ట వద్ద లెక్క ప్రకారం షుమారు 10 పదున్ల వర్షం కురిసింది.

నెల్లూరు ఆనకట్ట మీద 19వ తేది ఉదయం నీటిమట్టం 2.03 అడుగులు.

జీప్ ప్రమాదంలో భక్తవత్సలం

తన చెల్లెళ్ల వివాహానికి హైదరాబాద్‌కు పోతుండిన మంత్రి ఏసి రెండవ కుమారుడు ఆనం భక్తవత్సలరెడ్డి 12వ తేది సాయంకాలం హైదరాబాదుకు 58 మైళ్ల దూరంలో ప్రమాదానికి గురియై భక్తవత్సల రెడ్డి మాడుకు బలమైన గాయం తగిలి, కండ ఎక్కువగా నష్టమైనదని; అందులోనే ప్రయాణం చేస్తుండిన నిర్మల కాఫీ వర్కు కొండారెడ్డి సోదరుడు రామస్వామి రెడ్డి తలమీద రెండు గాయాలే గాక కాలర్ విరిగింది.

పెద్ద ప్రాణగండం నుండి తప్పించుకొన్న భక్తవత్సలంకు తదితర మిత్రులకు మా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

నెల్లూరు ముచ్చట్లు

చైనా నౌక కెప్టెన్ ఆదృశ్యంపై విచారణ!

కృష్ణపట్నం పోర్టు సమీపంలో గత నెల 18వ తేది చైనా నౌక కెప్టెన్ జంగ్ మింగ్‌క్వింగ్ అదృశ్యమైన విషయం తెలిసిందే. కెప్టెన్ అదృశ్యంపై జిల్లా పోలీసులు ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. చైనాకు చెందిన నావికాదళం అధికారులు సౌత్ చెన్నై నుంచి కృష్ణపట్నం తీరం వరకు ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల పోలీసుల సహకారంతో గాలించడం జరిగింది. ఈ సంఘటన జరిగి నెల రోజులు గడిచింది. కెప్టెన్ అదృశ్యంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నౌకలోని సిబ్బంది మధ్య జరిగిన ఘర్షణలో హత్యగావించబడ్డాడా? లేకుంటే కెప్టెనే సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా?? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా??? అన్న దానిపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

మండుతున్న ఎండలు

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. చినుకు రాలకపోవడం, ఎండలు పెరిగిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఏడాది పొడవునా ఎలా ఉన్నా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జోరు వానలు పడతాయి. అలాంటిది ఈ ఏడాది అక్టోబర్ నెల చివరి వారం సమీపిస్తున్నా ఒక్క చినుకు రాలకపోవడం, మరోవైపు వేసవి కాలాన్ని తలపిస్తూ ఎండలు భగభగమంటుండడంతో జిల్లావాసులు అల్లాడుతున్నారు. త్రాగునీరు, సాగునీటికి వెంపర్లాడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. 10, 11 తేదీల్లో జిల్లాలో నమోదైన 38, 38.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో ఎక్కడా నమోదు కాలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది.

విజృంభిస్తున్న డెంగ్యూ

జిల్లాలో డెంగ్యూ జ్వరం విజృంభిస్తోంది. నెల్లూరు నగరంతోపాటు కావలి, గూడూరు తదితర ప్రాంతాలలో డెంగ్యూ బారిన పడేవారి సంఖ్య ఎక్కువయ్యింది. ఈ జ్వరం సోకిన పలువురు చెన్నైకి వెళ్లి చికిత్స చేయించుకొంటున్నారు. కొత్తగా వేగూరు ప్రాంతంలో పలువురు ఈ జ్వరం బారిన పడ్డారు. నిన్నమొన్నటి వరకు జిల్లాలో డెంగ్యూ కేసులే నమోదు కాలేదని చెప్తున్న వైద్యాధికారులు ఇప్పుడు మాట మార్చారు. జిల్లాలో ప్రస్తుతం ఏడు డెంగ్యూ కేసులే నమోదయ్యాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాసిలామణి ప్రకటించారు. వాస్తవంగా చూస్తే నగరంలోని ప్రైవేటు ఆస్పత్రులలో అధికసంఖ్యలో డెంగ్యూ జ్వరం బారినపడి వారు చికిత్స పొందుతున్నారు.

పెరిగిన కరెంటు కోతలు

నెల్లూరు నగరంలో కరెంటు కోతలు పెరిగాయి. ప్రస్తుతం రోజూ ఐదు గంటల పాటు విధిస్తున్న కోతను పెంచి మరో ఒకటిన్నర గంట అధికంగా విధిస్తున్నారు. ఉదయం 6 గంటలకే కరెంటు తీసివేసి 9 గంటలకు ఇస్తున్నారు. 3 గంటలకు తీసి 6 ఆరు గంటలకు ఇస్తుండడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. పెరుగుతున్న ఎండలకు తోడు విద్యుత్ కోతల వేళలు పెరగడంతో నగరవాసులు అల్లాడి పోతున్నారు. కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక, నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుండడంతో నానా అగచాట్లు పడాల్సి వస్తోంది.

అధికారులపై ప్రసన్న ఆగ్రహం!

సాగునీటి సలహా బోర్డు సమావేశం నిర్వహణకు సంబంధించి ముందుగా నీటిపారుదల శాఖ అధికారులు సమాచారం ఇవ్వడంలో విఫలం చెందారని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 14వ తేది నిర్వహించిన ఐఏబి సమావేశానికి హాజరైన ఆయన ముందుగా ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఇరిగేషన్ ఎస్ఇని ప్రశ్నించారు. దీంతో ముందు రోజు సాయంత్రం డిఇ ద్వారా అజెండా పంపినట్లు వివరణ ఇవ్వబోగా, మధ్యలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్పించుకుని అధికారులు చేసిన పొరపాటును అంగీకరించాలన్నారు. సమర్థించుకునే విధంగా వ్యవహరించరాదని సున్నితంగా మందలించారు. ఇతర ఎమ్మెల్యేలకు సైతం అజెండా సమావేశం రోజు అందజేశారని సమావేశంలో చర్చించుకోవడం కనిపించింది. ఇరిగేషన్ అధికారులు మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను మంత్రి రామనారాయణరెడ్డి కోరారు.

సాయిబాబా మందిరంలో విజయదశమి!

నెల్లూరు గాంధీనగర్‌లోని సాయిబాబా మందిరంలో 24వ తేది నుంచి 26వ తేది వరకు విజయదశమి మహా సమాధి ఉత్సవాలు జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగుతాయి. ప్రతి సాయంత్రం ఏడు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. సాయి భక్తులు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొని బాబా కృపాకటాక్షాలకు పాత్రులవ్వాలని మందిరం ఛైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి కోరుతున్నాడు.

కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఎన్నిక!

విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అన్‌ఎయి

కొరవ 14వ పేజీలో

వజ్రం - బంగారం - వెండి ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

శ్రీ బాలాజి డయాగ్నోస్టిక్స్
(మల్టీ స్పెషాలిటీ లేబొరేటరి)
ఇందిరా భవన్‌ప్రక్కన, డా॥ సన్నపరెడ్డి కృష్ణారెడ్డి మిద్దెపైన, నెల్లూరు -1.
అన్ని రకముల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయబడును
• టైఫాయిడ్ • మలేరియా • డెంగ్యూ • HIV / AIDS
• బ్లడ్ షుగర్ • కొలెస్టరాల్ • లిపిడ్ ప్రొఫైల్ • లివర్ మరియు కిడ్నీ ఫంక్షన్ • థైరాయిడ్
అవసరమైన వారికి ఇంటివద్దకు వచ్చి శాంపిల్స్ తీసుకొనబడును.
డా॥ కె.శ్రీనివాసులు, MD
పెథాలజిస్ట్
ఫోన్: 0861-2305575, సెల్: 73821 49554



ప్రథమవర్థంతి
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మా ఇంటి వెలుగు
శ్రీమతి దర్శగుంట్ల కామాక్షమ్మ గారు
మమ్ములను వీడి సంవత్సరం నిండిన సందర్భంగా వారిని స్మరించుకుంటూ...
భర్త: డి.శేషాద్రి
తండ్రి పాటూరు చెంచురామయ్య
మరియు కుటుంబసభ్యులు
శ్రీమతి దర్శగుంట్ల కామాక్షమ్మ గారు
మరణం: 8-10-2011
ప్రథమవర్థంతి: తేది 26-10-2012 శుక్రవారం నెల్లూరు, న్యూ మిలటరీ కాలనీ 6వ క్రాస్‌రోడ్డులోని మా స్వగృహమునందు జరుగును.



శ్రీ మల్లిఖార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానము
జొన్నవాడ క్షేత్రము, బుచ్చిరెడ్డిపాళెం మండలం, SPSR నెల్లూరుజిల్లా.
ఫోన్: 08622 - 210556, 94910 00734
శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానము
తేది16-10-2012 మంగళవారం కలశస్థాపన
17వ తేది బుధవారం త్రిపురాంబిక అలంకారం
18వ తేది గురువారం రక్తబీజవధ అలంకారం
19వ తేది శుక్రవారం మధుకైటభవధ అలంకారం మరియు రాజరాజేశ్వరి అలంకారం
20వ తేది శనివారం సరస్వతీ అలంకారం
21వ తేది ఆదివారం భండాసుర అలంకారం
22వ తేది సోమవారం దుర్గాష్టమి, దుర్గా అలంకారం
23వ తేది మంగళవారం మహార్నవమి మహిషాసుర మర్దిని అలంకారం
24వ తేది బుధవారం విజయదశమి, శమిపూజ
అశ్వవాహనం, గ్రామోత్సవం. రాత్రి ఏకాంతసేవ.
తేది 16-10-2012 మంగళవారం నుండి 24-10-2012 బుధవారం వరకు
పై తేదీలలో జొన్నవాడ క్షేత్రంలో వెలసి భక్తుల ఇలవేల్పు, ఆరాధ్య దైవమైన
శ్రీమల్లిఖార్జున స్వామి కామాక్షితాయి వార్లకు శరన్నవరాత్రి మహోత్సవములు
అతివైభవముగా జరుగును. కావున భగవద్బంధువులెల్లరూ జొన్నవాడ క్షేత్రమునకు విచ్చేసి శ్రీవార్లను దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీవార్ల కృపకు పాత్రులు కాగోరుచున్నాము.
భగవత్ సేవలో: వి.రవీంద్రారెడ్డి, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

శ్రీ లలితాంబికా దేవి మణిద్వీప మహా సంస్థానము
శరన్నవరాత్రి మహోత్సవ శుభ ఆహ్వానము - 2012
అక్టోబరు 16 నుండి అక్టోబరు 24 వరకు
నవరాత్రులలలో అపూర్వ నిత్య అభిషేకాలు
శరన్నవరాత్రి ప్రతి నిత్యం మహా శక్తివంతమైన హోమాలు
మరియు శతచండీ హోమాలు మహా వైభవంగా జరుగును
విజయదశమి కరుణామయి అమ్మ జన్మదినోత్సవము
అందరూ ఆహ్వానితులే
విజయదశమి రోజున శ్రీ కరుణామయి అమ్మ ప్రత్యేకమైన దీవెనలు పొంది తరించండి.
శ్రీ మణిద్వీప మహా సంస్థానము
శ్రీపెంచలకోన క్షేత్రం, రాపూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 08621 - 221615 www.karunamayi.org





కార్పొరేషన్‌లో

డీజిల్ కుంభకోణం!

● తప్పుడు లెక్కలతో లక్షల రూపాయలు స్వాహా



నెల్లూరు కార్పొరేషన్ యాజమాన్యాన నడిచే డీజిల్ బంకు.

పలు కుంభకోణాలు, అవినీతి అక్రమాలకు పేరుగాంచిన నగర కార్పొరేషన్‌లో డీజిల్ కొనుగోలులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు సమాచారం. వాహనాల వినియోగం, డీజిల్ అవసరాలకు, బిల్లుల చెల్లింపునకు పొంతన ఉండకపోవడంతో డీజిల్ కొనుగోలు వ్యవహారంలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో ఎన్నో పెట్రోల్ బంకులు ఉన్నప్పటికీ ఇక్కడెక్కడా డీజిల్ కొనుగోలు చేయకుండా రాపూరులో ఉన్న ఒక పెట్రోల్ బంకు నుంచి కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపించి, లక్షలాది రూపాయలు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. అందులోనూ అధిక మొత్తంలో చెల్లింపు జరిపినట్లు లెక్కచూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇందుకోసం కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచే గాక, ఎల్‌ఆర్‌ఎస్ నిధులను దారి మళ్లించినట్లు సమాచారం. ప్రతి నెలా డీజిల్ కొనుగోలుకు సాధారణంగా పది లక్షల రూపాయలను ఖర్చు చేసే కార్పొరేషన్ 2011 – 12 ఆర్థిక సంవత్సరంలో కేవలం ఐదు నెలల్లోనే కోటి ఎనిమిది లక్షల రూపాయలు చెల్లింపులు జరగడం అవకతవకలు ఏ స్థాయిలో జరిగాయో చెప్పకనే చెబుతోంది. డీజిల్ కొనుగోలుకు, చెల్లింపునకు చాలా వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్‌కు సంబంధించి చెత్త తీసుకపోయే ట్రాక్టర్లు, ఆటోలు, టిప్పర్లు, మినీలారీలు, నీటి సరఫరా ట్యాంకులు, దోమల నివారణకు వినియోగించే ఫాగింగ్ మిషన్లు, అధికారులు వినియోగించే వాహనాలకు అవసరమైన డీజిల్‌ను నగర పాలక సంస్థ కొనుగోలు చేస్తుంటుంది. 2012 జూన్ నెలలో కార్పొరేషన్ సొంతంగా డీజిల్ బంక్ ఏర్పాటు చేసుకొంది. దీనికి ముందు ప్రైవేట్‌గా డీజిల్ కొనుగోలు చేసేది. ఆ సమయంలోనే ఈ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. నగరంలో ఉన్న పెట్రోల్ బంకులను కాదని, ఎక్కడో రాపూరులో ఉన్న పెట్రోల్ బంక్ నుంచి డీజిల్ కొన్నట్లు చూపడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డీజిల్ బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా నెల నెలా చెల్లిస్తుంటారు. అయితే 2011 – 12 ఆర్థిక సంవత్సరంలో మాత్రం అధిక మొత్తంలో బిల్లుపెట్టి కార్పొరేషన్ సొమ్ము బొక్కేసినట్లు సమాచారం. 2011 ఆగష్టు నుంచి 2012 జనవరి నెల వరకు కోటి ఎనిమిది లక్షల రూపాయలు చెల్లించడమే ఇందుకొక ఉదాహరణ. సొంత పెట్రోల్ బంక్ ఏర్పాటైతే అక్రమాలకు తావుండదని భావించిన కొందరు అధికారులు 2012 జూన్‌లోపే పెద్ద మొత్తంలో స్వాహా చేసేందుకు ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించినట్లు చూపడంపై గగ్గోలు రేగుతోంది. వాహనాల వినియోగానికి పది లక్షల రూపాయలు డీజిల్ సరిపోతున్నా దానిని తప్పుగా చూపి రెట్టింపు మొత్తం చూపడం అక్రమాల తీరును తేటతెల్లం చేస్తోంది. ఈ విషయమై లోతుగా దర్యాప్తు జరిపితే డీజిల్ కొను'గోల్మాల్' వ్యవహారం బట్టబయలౌతుంది.

● ఎసి స్టేడియంలో పందికొక్కులు

ఆకలితో అలమటిస్తున్న క్రీడాకారులు



అవినీతికి నిలయంగా మారిన ఎసి స్టేడియం.

అంశని అన్న చందంగా ఉంది ఎసి స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల పరిస్థితి. వారికి అందించాల్సిన పౌష్టికాహారాన్ని స్టేడియంలోని అధికారులు, సిబ్బంది ముప్పుటలా పందికొక్కుల్లా బొక్కుతుండడంతో క్రీడాకారులు అన్నమో రామచంద్రా అంటూ అలమటించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. క్రీడాకారులకు శారీరక దారుఢ్యం అవసరం. అందుకోసం వారికి పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది. స్టేడియంలో మాత్రం పనీపాటా లేకపోయినా బిజీగా ఉన్నట్లు నటిస్తున్న కొందరు కోచ్‌లు, ఇన్‌ఛార్జి డిఎస్‌డిఓ, కేర్‌టేకర్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తితోపాటు మరికొందరు సిబ్బంది మూడుపూటలా మెక్కిన తర్వాతే క్రీడాకారులకు ఆహారాన్ని పెడుతుండడంతో చాలీచాలని ఆహారం తిని అర్థాకలితో అలమటిస్తూ నీరసంగా మైదానంలో తిరుగుతున్నారు. ఇక్కడ క్రీడాప్రాధికార సంస్థకు అనుబంధంగా ఉన్న అకాడమీలోగల ఐదు విభాగాల్లో విద్యార్థినులు శిక్షణ పొందుతూ చదువుకొంటున్నారు. కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఒక్క విభాగం నుంచి 20 మంది చొప్పున 100 మంది వరకు శిక్షణ పొందే అవకాశం ఉన్నా ఇక్కడకు వచ్చేందుకు విద్యార్థినులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఈ ఏడాది 40 మందికి ప్రవేశం కల్పించినా కోచ్‌ల వేధింపులు ఇతరత్రా కారణాలతో 8 మంది బాలికలు అకాడమీ వదలి పెట్టారు. ప్రస్తుతం వాలీబాల్‌లో ముగ్గురు, బాస్కెట్‌బాల్‌లో ఇద్దరు, ఖోఖోలో 13 మంది, కబడ్డీలో 12 మంది, అథ్లెటిక్‌లో ఇద్దరు చొప్పున శిక్షణ పొందుతున్నారు. వీరికి క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శారీరక దారుఢ్యం కోసం శనివారం మినహా ప్రతిరోజూ 100 గ్రాముల మాంసం, చేపలు, రెండు కోడిగుడ్లు, 200 మిల్లీలీటర్ల పాలు, అరటి పండుతో కూడిన భోజనాన్ని, అల్పాహారాన్ని అందించాల్సి ఉంది. అకాడమీలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఇన్‌ఛార్జి అధికారి, కేర్‌టేకర్, మిగతా కోచ్‌లు, సిబ్బంది ముందు తమకు కావాల్సినంత తిని మిగిలింది క్రీడాకారులకు పెడుతుండడంతో కోడిగుడ్లు కరువై, ఆహారం చాలక, ఆకలి తీరక అర్థాకలితో ఉంటూ ఆడేందుకు శక్తి లేకుండా పోతోంది. బాలికలన్న కనికరం లేకుండా పందికొక్కుల్లా పిల్లలకు ఇచ్చే ఆహారాన్ని బొక్కుతున్న వీరిపై కలెక్టర్ తగిన చర్యలు చేపట్టి క్రీడాకారుల ఆకలి తీర్చాలని స్టేడియంకువచ్చే పలువురు కోరుతున్నారు.

వ్యాపార కేంద్రాలుగా దేవాలయాలు!



సమావేశంలో మాట్లాడుతున్న కమలానంద భారతీ స్వామి.

హిందూత్వాన్ని, దేశ సమైక్యతను కాపాడేది దేవాలయాలు అయితే, ఆ దేవాలయాలను కాపాడేది అర్చకులేనని రాష్ట్ర హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కమలానంద భారతి స్వామి అన్నారు. ఇటీవల స్థానిక రాఘవ కళ్యాణ మండపంలో సింహపురి అర్చక సింహగర్జన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, అర్చకుల నడ్డివిరుస్తున్నదని విమర్శించారు. దేవాలయాలలో పనిచేసే అర్చకుల పరిస్థితి చాలా ఘోరంగా ఉందని, వారికి రావాల్సిన జీతభత్యాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. గత ఆరేళ్ల నుంచి అర్చకులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. దేవాలయ పరిరక్షణ విషయంలో ఎండోమెంట్ తోకాడిస్తే కత్తిరిస్తామని తీవ్రంగా హెచ్చరించారు. దేవాదాయ శాఖ అధికారులు అర్చకులను పలు విధాలుగా వేధిస్తున్నారని ఈ పద్ధతి మార్చుకోకపోతే ప్రతిఘటన తప్పదన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని నెల్లూరు నుంచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దేవాలయాలను ప్రభుత్వం వ్యాపార కేంద్రాలుగా మారుస్తోందని రాష్ట్ర అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు ఎం.వి.సౌందర్ రాజన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో దేవాలయాలు కనీసం ధూపదీపాలకు కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్చకులను అధికారులు వేధిస్తున్నారని, మానసికంగా చిత్రవధకు గురి చేస్తున్నారన్నారు. నేటి యువత అర్చకత్వాన్ని స్వీకరించేందుకు ముందుకు రావడం లేదని, వచ్చినా అలాంటి వారిని వివాహం చేసుకునేందుకు ఆడపిల్లలు ఇష్టపడడం లేదని విచారం వ్యక్తం చేశారు. అర్చకులకు స్కేలు ఫిక్స్ చేయాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 32 వేల ఆలయాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని, అందులోని అర్చకులు మాత్రం అర్థాకలితో అలమటిస్తున్నారని బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.చంద్రమౌళి తెలిపారు. అర్చకులను పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి స్కేలు, క్యాడర్ ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకులు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, సోమశేఖర్, విశ్వేశ్వర ప్రసాద్, అనంత పద్మనాభాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చట్ట సవరణ!

మహిళల అసభ్య చిత్రీకరణ నిరోధక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. చట్ట సవరణ కోసం కేంద్ర కేబినెట్ కూడా ఆమోద ముద్ర వేసింది. ఇక నుంచి మహిళలను అసభ్యకరంగా చిత్రీకరించి ప్రసారమాధ్యమాల్లో చూపిస్తే 50వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడంతోపాటు కనీసం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించే విధంగా చట్టాన్ని సవరించారు. ఇప్పటివరకు ప్రింటు మీడియా దీని పరిధిలో ఉండేది తాజాగా సమాచార వ్యవస్థలన్నింటినీ ఇందులో చేర్చడం జరిగింది. టివి ఛానల్స్‌గానీ, ఎంఎంఎస్ ద్వారాగానీ అసభ్య చిత్రీకరణ చేసి పంపితే అటువంటి వారిని వెంటనే అరెస్ట్ చేసే అవకాశం చట్టం కల్పిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే మహిళలు ఈ చట్టం ద్వారా రక్షణ పొందేందుకు వీలు కల్పించారు. సమాచార వ్యవస్థలన్నీ కూడా ఇక నుంచి అసభ్యకరంగాలేని దృశ్యాలను ప్రసారం చేయాల్సి ఉంటుంది. అసభ్యకరమైన చిత్రీకరణపై సైబర్ విభాగానికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఈ చట్టంపై సమాచార వ్యవస్థల్లో పనిచేస్తున్న వారికి అవగాహన కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. జిల్లాస్థాయిలో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు త్వరలో ఏర్పాటు చేయనున్నారు.

అక్రమార్జనలో కోవూరు ఎమ్మెల్యే బిజీ!

● సోమిరెడ్డి చిటపట

ఎన్నికైన శాసనసభ్యులు ప్రజల బాగోగులు మరచి, ఇసుక వ్యాపారాలు, మద్యం మాఫియాలతో సంబంధాలు పెట్టుకొని అక్రమార్జనకు పాల్పడుతున్నారని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. కోవూరు మండలం వేగూరులో విషజ్వరాలు ప్రబలి, పలువురు డెంగ్యూ తదితర జ్వరాల బారిన పడుతుండడంతో ఆయన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగూరులో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. రెక్కడితేగాని డొక్కాడని పేదలు, సామాన్య ప్రజలు డెంగ్యూ తదితర ప్రాణాంతక వ్యాధుల బారినపడి ఆస్పత్రిల్లో చేరి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి రావడంతో ఆర్థికంగా చితికిపోతున్నారని, అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రజలు ఇంతగా సమస్యలతో సతమతం అవుతుంటే శాసనసభ్యుడు, పార్లమెంటు సభ్యులకు ఇవేమీ పట్టకపోవడం బాధాకరం అన్నారు. ఎమ్పీకి ప్రజాసమస్యలు తెలుసుకొనేందుకు సమయం చాలదని, శాసనసభ్యుడికి భూదందాలు, మద్యం వ్యాపారులతో లావాదేవీలు, అక్రమార్జానతో బిజీగా వుంటాడని పరోక్షంగా ప్రసన్నకుమార్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శలు చేశారు. గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడమేనన్నారు. సర్పంచ్‌లు వుంటే పరిస్థితి ఇంత దిగజారదన్నారు. తక్షణం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడ వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లను కలుసుకొని వారితో చర్చించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కృష్ణయ్య, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కలువాయి పిహెచ్‌సిలో నిధుల స్వాహా

కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లక్షల రూపాయల నిధులు స్వాహా అయ్యాయి. అధికారులు జరిపిన విచారణలో ఈ విషయం బట్టబయలైంది. పిహెచ్‌సి వైద్యుడు సందానిబాషా ఈ అవకతవకలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హాస్పిటల్‌కు మంజూరయ్యే నిర్వహణా నిధులు షుమారు ఎనిమిది లక్షల రూపాయలను ఈ ప్రబుద్ధుడు గత మూడేళ్లుగా స్వాహా చేశాడట. ఈ డాక్టర్ అవినీతిపై ఫిర్యాదులు అందడంతో నేషనల్ హెల్త్ రూరల్ మిషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పెంచలయ్య, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, గణాంకాధికారి ఖాదర్‌బాషాలతో కూడిన బృందం ఇటీవల కలువాయి వచ్చి పిహెచ్‌సిలో విచారణ జరిపింది. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఫండ్, ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణ నిధులు స్వాహా చేయడంతోపాటు, ఆశావర్కర్లకు, కంటిజెన్సీ వర్కర్లకు ఇవ్వాల్సిన జీతాలను దిగమింగాడట. చివరకు ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకొనే వారికి ప్రొత్సాహకాల క్రింద ఇచ్చే మొత్తాలను ఆరగించాడట. హాస్పిటల్‌కు ప్రభుత్వం మంజూరు చేసే ఏసి, ఇన్వర్టర్, మంచాలు, కుర్చీలను కొనకుండానే కొన్నట్లు రికార్డుల్లో చూపించి ఆ సొమ్ము జేబులో వేసుకొన్నాడట. మండలంలోని గ్రామ పంచాయితీలకు పంచాల్సిన 10 వేల రూపాయల పారిశుద్ధ్య నిధులు సక్రమంగా పంపిణీ చేయకుండా అందులోనూ చేతివాటం ప్రదర్శించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. మాజీ ఎంపిపి ముజీర్‌బీ హాస్పిటల్‌కు విరాళంగా ఇచ్చిన మంచాలు, కుర్చీలు పిహెచ్‌సి నుంచి మాయమైనట్లు తెలుస్తోంది. ఇంతగా అక్రమాలకు పాల్పడిన డాక్టర్ సందానిబాషా మొదటి నుంచి వివాదాస్పదుగా ముద్రపడ్డాడు. పూటుగా మద్యం సేవించి విధులకు రావడం, తన క్రింద పని చేసే మహిళా సిబ్బందితో అసభ్యకరంగా మట్లాడడం, వేధించడం వంటి ఆకృత్యాలకు పాల్పడి వున్నాడు. దీనిపై గతంలోనూ ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. తాజాగా హాస్పిటల్ నిధులు దిగమింగి అధికారులకు దొరికిపోయాడు. విచారణ జరిపిన అధికారులు రికార్డులు సీజ్ చేసి నివేదికను డిఎంహెచ్‌ఓకు అందజేస్తామన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

అభివృద్ధిలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, పరస్పర సహకారం ఉండాలని లేదంటే సమస్యలు తలెత్తుతాయని ఇందుకూరుపేట మండలం ప్రత్యేకాధికారిణి సుధాభారతి అధికారులకు సూచించారు. మండలంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేయడంతోపాటు చురకలు అంటించారు. సమావేశం ప్రారంభంకాగానే కొరుటూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి చెపుతున్న సమయంలో, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కలగజేసుకొంటూ అద్దె భవనంలో కాదని అంగన్‌వాడీ కేంద్రాన్ని పూరిగుడిసెలో నడుపుతున్నామని చెప్పడం సమావేశంలో కలకలం రేపింది. ఇరు శాఖల మధ్య పొంతనలేని సమాధానాలు రావడంతో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఏ విషయంలోనైనా శాఖల మధ్య సమన్వయం వుండాలన్నారు. మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పనితీరుపై సమీక్షించారు. స్థానికంగా వుండే బిసి బాలుర హాస్టల్‌లో ఒకే గదిలో 80మందికి పైగా విద్యార్థులు వుంటున్నారని ఆమె దృష్టికి తీసుకొని వచ్చారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గది కూడా శిథిలమై శ్లాబ్ కూలిపోయే పరిస్థితిలో వుందని చెప్పడంతో స్పందించిన ఆమె హాస్టల్‌ను వేరొక భవనంలోనికి మార్చే విషయమై పరిశీలించి తగిన నిర్ణయం తీసుకొంటామన్నారు. పంచాయితీరాజ్, రెవెన్యూ అధికారులు అభివృద్ధి పనుల విషయంలో సమన్వయంతో పని చేయాలన్నారు.

ఘనంగా విశ్వోదయ వజ్రోత్సవ వేడుకలు



దగ్గుపాటి పురందేశ్వరి సన్మాన దృశ్యం.

కావలి విశ్వోదయ విద్యాసంస్థల వజ్రోత్సవాలు ఘనంగా జరిగాయి. అక్టోబర్ 14న జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మానవవనరులశాఖ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తన తండ్రి ఎన్‌టి రామారావు పాల్గొని ప్రసంగించిన వేదిక మీద నుంచి తాను మాట్లాడడం పట్ల గర్వంగా వుందన్నారు. విశ్వోదయ వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి (డిఆర్) దార్శనికులని, లక్షలాది మందికి విద్యాదానం చేసిన మహోన్నతులని కొనియాడారు. ఆయన బాటలో నడుస్తూ విద్యాభివృద్ధికి పాటు పడుతున్న డిఆర్ కుటుంబ సభ్యులను ఆమె అభినందించారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారిలో కొందరు దురాగతాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారంటే దానికి కారణం వారిలో నైతిక విలువలు లేకపోవడమేనన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు నైతిక విలువలను నేర్పించాల్సిన అవసరం ఎంతో వుందన్నారు. ఉపాధ్యాయులు సైతం పిల్లలకు చక్కని విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి తన వాక్పటిమతో సంస్కృత పద్యాలను అలవోకగా చెబుతూ, దానికి అర్థాలు విడమరచి చెప్పడం, తెలుగువారి గొప్పతనాన్ని కవిత రూపంలో చెప్పి దానికి తన తండ్రి ఎన్‌టిఆర్‌ను పోల్చినపుడు సభ హర్షధ్వానాలతో దద్దరిల్లింది. కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ జవహర్‌భారతి కళాశాల విద్యార్థులు దేశంలో ఎంతో ఉన్నత స్థానాలలో వున్నారని తెలిపారు. ఇక్కడ చదవడం అంటేనే గొప్ప అదృష్టంగా భావిస్తారన్నారు. విశ్వవిఖ్యాతనట సార్వభౌముడు, పేదలపాలిట పెన్నిధి, తమ నేత ఎన్‌టిఆర్ తనయ, కేంద్రమంత్రి పురందేశ్వరి తాను ప్రాతినిధ్యం వహించే కావలి పట్టణానికి రావడం, ఆ కార్యక్రమంలో తాను పాల్గొనడం పట్ల గర్వంగా వుందన్నారు. సీనియర్ పాత్రికేయులు, హెచ్‌ఎంటివి అధినేత రామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి యూనివర్శిటీ విసి రాజారామిరెడ్డి, రిటైర్డ్ విసి విశ్వేశ్వరరావు, రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరికి జీవిత సభ్యత్వం ఇచ్చి ఘనంగా సన్మానించారు.

చెరువు ఆక్రమణలపై జలదంకి రైతుల ఆందోళన

ఆక్రమణలు తొలగించాలని రైతులు ఒకవైపు, తాము చేసిన ఆక్రమణల వల్ల రైతులకు ఎలాంటి నష్టం లేదని ఆక్రమణదారులు పోటీ పోటీగా ప్రదర్శన నిర్వహించడం జలదంకిలో చర్చనీయాంశమైంది. స్థానిక పెద్ద చెరువును కొందరు ఆక్రమించుకొన్నారని దీనివల్ల ఆయకట్టు భూములకు నష్టం జరుగుతోందని ఆయకట్టు రైతులు మండల కేంద్రం వద్ద రాస్తారోకో చేపట్టారు. తక్షణం ఆక్రమణలను తొలగించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ఆక్రమణలపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని, మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలన్నారు. అదే సమయంలో విషయం తెలుసుకొన్న ఆక్రమణదారులు జలదంకి తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొనడంతో ఉద్రిక్తత తలెత్తింది. తాము చేసిన ఆక్రమణల వల్ల ఆయకట్టు భూములకు ఎలాంటి నష్టం జరగదని చెప్పడం పట్ల ఆయకట్టు రైతులు తీవ్రంగా ఆక్షేపించారు. ఇరువర్గాల మధ్య వివాదం ముదురడంతో సమాచారమందుకొన్న ఇరిగేషన్ డిఇ శ్రీదేవి అక్కడకు చేరుకొని రైతులను శాంతపర్చడంతో వారు సద్దుమణిగారు.



ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలను సహించను

కావలిలో అధికారులను హెచ్చరించిన కలెక్టర్

ఇందిరమ్మ గృహాల కేటాయింపులో అవినీతి అక్రమాలకు తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కావలి తహశీల్దార్ కార్యాలయంలో ఇటీవల ఆయన నియోజకవర్గ పరిధిలోగల ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపులు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. స్థానిక శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్, నీటి సరఫరాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఇళ్లు కేటాయించే సమయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, మరొకసారి అవకతవకలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల బుడమగుంట ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలకు పాల్పడిన వైనంపై విచారణ జరపాలని కావలి ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యంరెడ్డిని ఆదేశించారు. ఆరో విడత భూపంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు పలు ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొనివచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యంరెడ్డి, హౌసింగ్ పిడి వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి సోమయ్య, బిసి కార్పొరేషన్ ఈడి కోటేశ్వరరావు, తహశీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వాన్నం!

బోగోలువాసుల బాధ పట్టేదెవరికి?



బోగోలు మండలంలో పారిశుధ్యం క్షీణించడంతో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. అధికారులకు శ్రద్ధ లేకపోవడం, బాగోగులు పట్టించుకొనేవారే లేకపోవడంతో ముదనష్టంగా తయారైంది. ముఖ్యంగా బోగోలు పంచాయితీలో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయి. పేరుకపోతున్న చెత్తతోపాటు పందుల సంచారం అధికం కావడంతో స్థానికులు తిరగాలంటేనే ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్థానికంగా వుండే మార్కెట్‌లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుంది. వ్యాపారులు వ్యర్థాలను అక్కడే పడేస్తుండడంతో వ్యర్థాలు పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సైడు కాలువల్లో సైతం చెత్త, ప్లాస్టిక్ కవర్లు చేరి మురుగునీరు పోయేందుకు ఆటంకం ఏర్పడి రోడ్లపైకే ఆ నీరు ప్రవహిస్తుండడంతో పరమ రోతగా మారుతున్నాయి రహదారులు. వీటిలో పందులు పొర్లుతుండడం, దోమలు అధికం కావడంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోగోలుతోపాటు మండలంలోగల 16 పంచాయితీలదీ ఇదే పరిస్థితి. పారిశుధ్యం క్షీణిస్తున్నా, పరిస్థితులు ఘోరంగా మారుతున్నా పట్టించుకొనేవారే లేకుండా పోవడంతో మండలంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొనివున్నాయి. దీనిని దృష్టిలో వుంచుకొని అధికారులు తగిన చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని మండల ప్రజలు కోరుకొంటున్నారు.

వెంకటగిరిలో త్రాగునీటి సమస్య!

వెంకటగిరి ప్రాంతంలో మంచినీటి పథకాలున్నా అవి పూర్తిస్థాయిలో ప్రయోజనంలోకి రాకపోవడంతో నియోజకవర్గ పరిధిలో మంచినీటి సమస్య తీవ్రంగా వుంది. పట్టణ పరిధితో పాటు గ్రామాల్లోను రక్షిత మంచినీటి పథకాలున్నా అవి ప్రజల దాహార్తిని తీర్చలేకపోతుండడంతో పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని చోట్ల త్రాగునీటి సమస్య ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడు తోంది. రక్షిత నీటి పథకాలున్నా విద్యుత్ కోతల కారణంగా అరకొరగా జరిగే నీటి సరఫరాకు ఆటంకాలు ఎదురౌతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి పథకాలు పూర్తిస్థాయిలో ఫలితాల్ని ఇవ్వలేక పోతుండడంతో దాతలు అందించే నీటి సరఫరా ట్యాంకులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. వెంకటగిరి పట్టణంతోపాటు డక్కిలి మండలం మోపూరు క్రాస్‌రోడ్డు, బిసి కాలనీ, దళిత వాడల్లో నీటి పథకాలున్నప్పటికీ నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కో వాల్సి వస్తోంది. దగ్గవోలు గ్రామంలోని మిట్టపాళెం, దళితవాడల్లో ఇదే సమస్య ఎదురౌతోంది. మండలంలోని ఆల్తూరుపాడులో విద్యుత్ కోతల వలన నీటి సరఫరా జరగడం లేదు. నియోజవర్గ పరిధిలో ప్రజలకు అవసరమైన మేర మంచినీటిని అందించే పథకాలు పూర్తిస్థాయిలో లేకపోవడం, వున్న చోట్ల మరమ్మత్తులు, విద్యుత్ కోతల కారణంగా నీటి సరఫరా జరగకపోవడంతో పేరుకే నీటి పథకాలు తప్ప ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. తీవ్రతరం అవుతున్న త్రాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొనైనా అధికారులు ప్రజల దాహార్తి తీర్చేందుకు తగిన చర్యలు చేపట్టాల్సి వుంది.

చదువుకోవాలంటే నడవాల్సిందే!


● **కోనారెడ్డిగుంట కాలనీ పిల్లల అవస్థ అంతా ఇంతా కాదు.**

చదువుకోవాలన్న జిజ్ఞాస ఒకవైపు, అందుకోసం ఎదురయ్యే ఇబ్బందులు మరోవైపు అక్కడి విద్యార్థులను తీవ్రంగా క్షోభపెడుతున్నాయి. పాఠశాలకు వెళ్లేందుకు వాహన సౌకర్యం లేకపోవడం, నడచి వెళ్లాల్సి రావడంతో అల్లూరు మండలం కోనారెడ్డిగుంట కాలనీ పిల్లలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈ ప్రాంతంలో 172 కుటుంబాలు నివాసం వుంటున్నాయి. ఇక్కడ నివసించే ప్రజలలో అక్షరాస్యత శాతం తక్కువ. వీరి పిల్లలు చదువుకొనేందుకు పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో వున్న నాగులదేవిగుంటకు నడచి పోవాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వాహన సదుపాయం లేకపోవడంతో నడిచిపోవాల్సి వస్తుండడంతో వీరి చదువులకు ఆటంకాలు ఎదురౌతున్నాయి. దీంతో తల్లిదండ్రుల నుంచి తగిన ప్రోత్సాహం కొరవడుతుండడంతో పిల్లలు చదువు కోవాలన్న కోరిక వున్నా పాఠశాలకు వెళ్లలేని పరిస్థితులు ఎదురౌతున్నాయి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో వుంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూసి వీరి ఇబ్బందులను తొలగించి చదువులకు ఆటంకం కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారే అవినీతిపరులు!

తెలుగుదేశం పార్టీ వారిపై కావలి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేత రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి చేసిన ఆరోపణలపై స్థానిక టిడిపి నేతలు తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యేపైనా, నేతలపైనా నిరాధార ఆరోపణలు చేయడం కాకుండా ఆధారాలతో సహా నిరూపించాలని సవాల్ విసిరారు. కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో లీగల్‌సెల్ అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి గాదం శెట్టి వేణుగోపాల్‌లు ప్రతాప్‌కుమార్ రెడ్డి చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. ఇందిరమ్మ ఇళ్ల తొలగింపులో ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొన్నట్లు ఆరోపించడం సరికాదన్నారు. అవినీతి, అక్రమాలు జరిగిన ఇళ్లను, అనర్హులు చేజిక్కించుకొన్న ఇళ్లను అధికారుల పర్యవేక్షణలోనే తొలగించారు తప్ప ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోలేదన్నారు. అందులో అవినీతి, అవకతవకలకు పాల్పడిన వారు కాంగ్రెస్ పార్టీ నుంచి వలస వచ్చి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వున్నారన్నారు. అక్రమార్కులకు మద్దుతుగా నిలుస్తూ ఎమ్మెల్యేపై నిందలు వేయడం సరికాదని ప్రతాప్ కుమార్‌రెడ్డికి హితవు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి బీద మస్తాన్‌రావు సొంత నిధులు ఖర్చు పెడుతున్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఇలాంటి అవాకులు చవాకులు మాట్లాడడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా కార్యదర్శి పూనూరు రవికుమార్‌రెడ్డి, చేవూరి మాల్యాద్రి, రమణయ్య, ఖలీల్, రవి తదితరులు పాల్గొన్నారు.





వెంకటాచలంలో నీటి ఎద్దడి!

అల్లాడుతున్న మూగ జీవాలు

గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడం, కార్యదర్శులకు కనీసపాటి అవగాహన లేకపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందనేందుకు వెంకటాచలం మండలం ఉదాహరణగా చెప్పుకోవచ్చు. భూగర్భజలాలు అడుగంటడం, ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. గత ఏడాదితో పోలీస్తే ఈ సంవత్సరం మంచినీటి సమస్య మరింత తీవ్రమైంది. గొంతు తడుపుకొనేందుకు ప్రజలు నానా తంటాలు పడాల్సి వస్తోంది. మండలంలోని కసుమూరు బిట్–1, బిట్–2, కురిచెర్లపాడు, చెముడుగుంట, అనికేపల్లి, సర్వేపల్లి, ఇడిమేపల్లి, కంటేపల్లి, వడ్డిపాళెం గ్రామాలలో ఈ సమస్య అధికంగా వుంది. సర్పంచ్‌లు పదవిలో వున్న కాలంలో నీటి సమస్య ఎక్కువగా వున్న ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా జరిగేలా చూసేవాళ్లు, సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవడం, కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్ల పాలన రావడంతో ప్రజల బాగోగులు గురించి పట్టించుకొనే వారే లేకపోవడంతో త్రాగునీటి కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. వర్షాలు కురవకపోవడం నీటి సమస్య అధికం కావడానికి ఒక కారణం అయితే, వున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోలేకపోవడం మరొక కారణం. మనుషులతోపాటు మూగజీవాల పరిస్థితి దయనీయంగా వుంది. మండలంలో పశుసంపద అధికంగా వుండడంతో నీరు దొరకక పశువులు అల్లాడుతున్నాయి. ఈ సమస్యపై మండలంలోని మహిళలు ఇటీవల ఎంపిడిఓ సుగుణమ్మను కలసి వినతిపత్రం అందజేశారు. మంచినీటి సమస్య కారణంగా తాము పడుతున్న బాధలను ఆమెకు వివరించారు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వెంకటాచలం మండల ప్రజలు కోరుకొంటున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న రేషన్ డీలర్

సీజ్ చేసిన అధికారులు

ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా పేదలకు బియ్యం, పప్పు, కిరోసిన్ తదితర వస్తువులను సరఫరా చేస్తోంది. అయితే కొందరు రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడుతూ ప్రజలకు రేషన్ అందకుండా చేస్తూ వాటిని బ్లాక్ మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకొంటున్నారు. రేషన్‌కార్డు కల్గిన వారికి సరుకులను ఇవ్వకుండా వారి పేరుతో తానే స్వాహా చేస్తున్న రేషన్ డీలర్ వ్యవహారం రట్టయ్యింది. ముత్తుకూరు పంచాయితీ బలిజపాళెంలో గల 39 నెంబర్ రేషన్‌షాపు ద్వారా అక్కడి వారికి బియ్యం, ఇతర సరుకులను అందజేస్తారు. గత కొంతకాలంగా ఈ డీలర్ ప్రజలకు రేషన్ ఇవ్వకుండా వారి పేరుతో తప్పుడు రికార్డులు చూపి ప్రక్కదారి పట్టిస్తుండడంపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా స్పందించిన పౌరసరఫరాల శాఖాధికారులు ఎట్టకేలకు రేషన్ షాపును తనిఖీ చేశారు. వినియోగదారుల వేలిముద్రలు వేసేసి సరుకులు తీసుకొన్నట్టు చూపి బయటకు తరలించడాన్ని గుర్తించారు. గ్రామస్తులకు ఎవరికి ఇవ్వకుండానే ఇచ్చినట్లు నమోదుచేసి వుండడంపై విచారించారు. అలాగేషాపులో 4,892 కిలోల బియ్యం నిల్వ వుండాల్సి వుండగా 600 కిలోలు లెక్క తేలకపోవడం, చక్కెర ఇతర సరుకుల్లోను స్టాక్‌కు, రికార్డులకు పొంతన లేకపోవడంతో రేషన్‌షాపును సీజ్ చేశారు. అందులోని సరుకులను 13వ నెంబర్ షాపుకు తరలించి వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా వుండేలా చర్యలు చేపట్టినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పారు. ఎలాంటి ఇబ్బంది కల్గినా వినియోగదారులు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు చేపడతామన్నారు.

భూ అక్రమాలపై విజిలెన్స్ విచారణ!

● ముత్తుకూరులో వెలుగుచూస్తున్న నకిలీ పట్టాలు

ముత్తుకూరు మండలంలో వివిధ ప్రాజెక్టుల నిమిత్తం జరిపిన భూసేకరణ, అనంతరం జరిగిన పరిహారం పంపిణీలో పలు అక్రమాలు జరిగినట్లు సమాచారం. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో పలు అక్రమాలు బట్టబయలైనట్లు తెలుస్తోంది. సీలింగ్ భూముల్ని పట్టా భూములుగా చూపి పరిహారం పొందడం, పోరంబోకు భూములకు డిఫామ్ పట్టాలు సృష్టించి అమ్మకాలు జరిపిన ఉదంతంపై విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బంజరు భూమిని సాగు భూమిగా చూపించి జెన్‌కో ప్రాజెక్టు ద్వారా 2.90 కోట్లు పరిహారం పొందిన వైనంపై క్షుణంగా తనిఖీలు చేపట్టారు. నేలటూరులో సీలింగ్ భూముల్ని పట్టా భూములుగా మార్చినట్లు సుబ్బారెడ్డి అనే వ్యక్తిపై వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అధికారులు స్పందించారు. వరకవిపూడి, అనంతవరం గ్రామాల్లో 16–1 సర్వే నెంబర్‌లో 23.87 ఎకరాలను రిటైర్డ్ తహశీల్దార్ సంతకాలతో డి–ఫారం పట్టాలు సృష్టించి వాటిని అమ్మి లక్షల్లో స్వాహా చేసినట్లు వచ్చిన సమాచారంపైనా తనిఖీలు జరిపారు. ఈ భాగోతం వెనుక అధికార పార్టీ నేతలతోపాటు వరకవిపూడి, పైనాపురం గ్రామస్తులు కొందరు వున్నట్లు సమాచారం. ఈ నకిలీ పట్టాలపై సమగ్ర విచారణ జరిపితే ఈ అక్రమాలకు తెర వెనుక వుండి అండదండలందిస్తున్న వారి గుట్టు రట్టవుతుంది.

● ఇస్కపల్లి ఆరోగ్య కేంద్రంలో

అందని వైద్యసేవలు!

ఇస్కపల్లి పంచాయితీ పరిధిలోగల ఆరోగ్య కేంద్రానికి సుస్తీ చేసింది. ఇక్కడకు వచ్చే రోగులకు వైద్య సహాయం అందించడం అటుంచితే ముందు ఈ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి పట్టిన మాయదారి రోగాన్ని వదిలించాల్సి వుంది. ఈ ఆరోగ్య కేంద్రానికి చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వచ్చేవారు. డాక్టర్లు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో ఎవరికి తెలియదు. ఇక సిబ్బంది సంగతి సరాసరి. వైద్యులుగాని, సిబ్బంది గానీ అందరూ బయటి ప్రాంతాల నుంచి రావాల్సి వుండడంతో వారికి బుద్ధి పుట్టినప్పుడు వచ్చి కొద్దిసేపు వుండి వెళ్లిపోతుండడంతో హాస్పిటల్‌కు వచ్చినా ప్రయోజనం వుండదని భావించిన రోగులు క్రమంగా హాస్పిటల్‌కు రావడమే మానేశారు. ఈ సంగతి అధికారులకు తెలిస్తే అసలుకే ఎసరు వస్తుందన్న భయంతో ఇక్కడి సిబ్బంది టక్కుటమార విద్యలను ప్రదర్శిస్తున్నారు. హాస్పిటల్ పేషంట్ రిజిష్టర్‌లో అధిక సంఖ్యలో రోగులు వచ్చినట్లు నమోదు చేస్తూ అధికారులను మోసం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వైద్య చికిత్స కోసం వచ్చేవాళ్లు కావలి, నెల్లూరుకు తీసుకపోవాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఆరోగ్య కేంద్రం వున్నా ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నదని దీనికి వైద్యులు నిర్లక్ష్యమే కారణమని మాజీ సర్పంచ్ రషీద్ ఆరోపిస్తున్నారు. వైద్యాధికారులు స్పందించి ఈ ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులో వుండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



పేరుకే ఆరోగ్య కేంద్రం.



శ్రీ షిరిడి సాయిబాబా విజయదశమి
మహాసమాధి మహోత్సవము

తేది 24-10-2012 బుధవారం నుండి
తేది 26-10-2012 శుక్రవారం వరకు
విజయదశమి
మహాసమాధి మహోత్సవములు
జరుగును.

ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి శ్రీ బాబా వారికి
మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును.

మధ్యాహ్నం 12గం॥ల నుండి
సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమాస్తా వద్ద రూ.75/-లు చెల్లించి
పూజలలో పాల్గొని బాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించి
బాబావారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

గమనిక: పై దినములలో ప్రతిరోజూ సాయంత్రం 7గంటలకు
సాంస్కృతిక కార్యక్రమాలు జరుగును.

ఇట్లు కార్యవర్గం
శ్రీ షిరిడి సాయిబాబా మందిరం
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్ : 2327771

దినేష్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలి!



డిజిపిగా దినేష్ రెడ్డి వైఖరి పట్ల అటు పోలీసు వర్గాలలో, ఇటు రాజకీయ వర్గాలలో తీవ్రమైన అసంతృప్తి వెల్లువెత్తుతున్నది. డిజిపి అనేది పోలీసు శాఖలో అత్యున్నత స్థానం. ఐపిఎస్ చదివిన వారందరినీ ఈ అదృష్టం వరించదు. పెట్టి పుట్టిన వారికే ఆ భాగ్యం దక్కుతుంది. డిజిపిలు అయ్యేవారిలో అధిక భాగం తమ సర్వీసు చివరి దశలో, ఏ పదినెలలో, పన్నెండు నెలలో లాంఛన ప్రాయంగా ఆ గౌరవాన్ని అందుకొంటూ వుంటారు. వ్యవధి తక్కువ కావడం వల్ల తమ మనసులోని ఆలోచనలు, తమ అనుభవాలను వినియోగించి పోలీసు శాఖలో మార్పులు చేర్పులు చేసే అవకాశం దొరకదు. కానీ దినేష్‌రెడ్డి చాలా అదృష్టవంతుడు. ఇప్పటికే ఆయన ఒక ఏడాదికాలంగా డిపిజి పదవి నిర్వహిస్తున్నాడు. సుప్రీంకోర్టు తీర్పు పుణ్యమా అని ఇప్పుడు మరొక రెండేళ్లపాటు ఆ పదవి ఆయన చెంతనే వుండబోతున్నది. వచ్చిన కొద్ది కాలంలోనే సాక్షాత్తు ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ చేతనే శెభాష్ అన్పించుకొనే రీతిలో విధి నిర్వహణ చేశారు. మొన్నటి తెలంగాణ కవాతు సందర్భంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. అంత మంచి పేరు తెచ్చుకొన్న వ్యక్తి స్వల్ప వివాదాలలో తలదూర్చడం ఎంత వరకు సముచితమన్నది ప్రశ్న.

ఇటువంటి వున్నత స్థానాలలో వుండేవారు ఉదాత్త మానసంతో వ్యవహరించడం సత్సాంప్రదాయం. కానీ ఎందువల్లనో దినేష్‌రెడ్డి గారు తన స్వభావానికి విరుద్ధంగా శత్రు సంహారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని పోలీసు వర్గాలలో అసంతృప్తి చెలరేగుతున్నది. మరొక డిజిపి ఉమేష్‌కుమార్ వివాదంలో ఆయన కక్షతో వ్యవహరిస్తున్నారన్నది ఆరోపణ. ఉమేష్‌కుమార్ చేసింది ఖచ్చితంగా తప్పే. చట్టాన్ని పాటింపచేయవలసిన అత్యున్నత అధికారి, చట్టాన్ని ధిక్కరించి, ఫోర్జరీ వంటి నేరాలకు పాల్పడడం శిక్షించదగిన నేరం అనడంలో సందేహం లేదు. అందువల్లనే ఉమేష్‌కుమార్ సస్పెండ్ అయ్యాడు. డిజిపి స్థాయిలో, ఫోర్జరీ నేరంపై సస్పెండ్ కావడం కంటే ఏ అధికారికి కూడా పెద్ద శిక్ష వేరొకటి వుండదు. ఆ వివాదాన్ని న్యాయ స్థానాల పరిధికి వదిలేయడం సమంజసమని తతిమా పోలీసు అధికారుల భావన. కానీ దినేష్ రెడ్డి గారు ఉమేష్‌కుమార్‌ను వెంటాడుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. స్వంత శత్రువుల మీద అధికార బలాన్ని ప్రయోగించడం పెద్ద మనుషులు చేసే పని కాదు.

తాజాగా మాజీ మంత్రి శంకరరావు ఉదంతం దినేష్‌రెడ్డి పట్ల రాజకీయ వర్గాలలో కూడా అసంతృప్తికి దారి తీస్తున్నది. శంకరరావు రాజకీయ లిటిగెంట్. గత మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికౌతున్నా, ఆయన తత్వం ఎవరికీ తెలియలేదు. వైఎస్‌జగన్ మీద హైకోర్టుకు లేఖ వ్రాయడంతో మొదటిసారిగా బుద్ధి బయటపడింది. ఆ కేసులో తన ప్రతిష్ట పెరిగిందనే భావనతో శంకరరావు నోటికి హద్దు లేకుండా పోతున్నది. చీటికి మాటికి ఎవరిని పడితే వారి మీద ఆరోపణల బురద క్రుమ్మరించడం ఒక అలవాటుగా మారింది శంకరరావుకి. ఆయన బాధితులలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డితో పాటుగా డిజిపి దినేష్‌రెడ్డి కూడా వున్నారు.

హైదరాబాదులోని ఒక కాలనీ వాసులను ఫోర్జరీ పత్రాలతో మోస పుచ్చాడన్న నేరం ఒకటి శంకరరావు మీద ఆపాదించబడి వుంది. దానిపై ఎఫ్ఐఆర్ నమోదై వుంది. అయితే హైకోర్టు ఆదేశంతో చాలాకాలంగా పోలీసు చేతులు కట్టేసి వుంచారు. ఇప్పుడు హైకోర్టు స్టే తొలగింది. ఆ వెంటనే శంకరరావు ఇంటికి ఒక పెద్ద పోలీసు పటాలం వెళ్లింది. వారు ఇంట్లో దూరి నానా రాద్ధాంతం చేశారు. గోడకున్న కప్ బోర్డులను పగలకొట్టి మరీ, శంకరరావు అక్కడేమైనా దాక్కొన్నాడేమో అని వెతికారు.

శంకరరావు సాధారణ వ్యక్తి కాదు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రాజకీయవాది. ఇందిరా కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఒకడిగా ప్రసిద్ధి చెందిన జి.వెంకటస్వామి అల్లుడు. ప్రస్తుత ఎమ్పీ వినోద్‌కు బావ. అటువంటి వ్యక్తి విషయంలో అరెస్టు కోసం పోలీసు అంత అత్యుత్సాహం చూపడం పెద్ద తప్పిదం. హైకోర్టు స్టే తొలగింపు జరిగింది విచారణకు మాత్రమే తప్ప అరెస్టు కోసం కాదు. విచారణ లేకుండా అరెస్టు చేయాలనుకోవడం చట్టాన్ని అతిక్రమించడమే. అంత తొందరపాటు, అంత దౌర్జన్య పోకడ ఈ విషయంలో అవసరమా అన్నది ప్రశ్న.

ఇప్పుడు శంకరరావు అదే డిజిపి ఆఫీసు ముందు నిలబడి దమ్ముంటే అరెస్టు చేయండి చూస్తానని సవాలు విసిరాడు. కానీ పోలీసు చూస్తూ వూరుకోవడం తప్ప ఏమీ చేయలేకపోయింది. ఆయన జోలికి వెళ్తే పెద్ద రాజకీయ రాద్ధాంతం జరగడం ఖాయమనే భయంతోనే నిగ్రహం వహించారు పోలీసులు. శంకరరావు నేపథ్యం తెలిసి కూడా ఆయన ఇంట్లో అత్యుత్సాహానికి ఎందుకు పాల్పడ్డారన్నది ప్రశ్న. ఆ బాధ్యత డిజిపి మీదకు వెళ్తున్నది.

తెలంగాణ పత్రికా విలేకరులను ప్రధాన మంత్రి కార్యక్రమానికి అనుమతించక పోవడంలో కూడా దినేష్‌రెడ్డి సరైన వ్యూహం పాటించలేదన్నది మరొక విమర్శ. మనది ప్రజాస్వామ్య దేశం. పత్రికల వారికి రాజ్యాంగ బద్ధమైన స్వేచ్ఛలు కొన్ని వున్నాయి. వాటిని నియంత్రించే అధికారం ప్రభుత్వాలకు, పోలీసులకు లేవు. ఆ ప్రయత్నం చేస్తే

కొరవ 14వ పేజీలో

రవిచంద్ర నెత్తిన తెలుగు ముళ్లకిరీటం!



నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బీద రవిచంద్ర ఎంపికైనారు. పదేళ్లకు పైనుంచి జిల్లాలో పార్టీకి పెద్ద దిక్కుగా వుండిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన భారం దించుకొన్నారు. రవిచంద్ర నిఖార్సైన రాజకీయవాది. ఈ తరం రాజకీయాలలో వుండే అవలక్షణాలేవీ ఆయనలో లేవు. సాత్విక స్వభావం, వివాదాలలో తలదూర్చని నిగ్రహం, పార్టీ పట్ల తిరుగులేని విధేయత, కార్యకర్తలతో కలిసి మెలిసి నడిచే నిరాడంబరత, ఇరవైఏళ్ల నుంచి రాజకీయాలలో వున్నా చిన్నపాటి మచ్చ లేకుండా జాగ్రత్తపడే స్వచ్ఛత బీద రవిచంద్ర స్వంతం. అందువల్లనే చంద్రబాబు రవిచంద్రను మొదట నుంచి దగ్గర తీస్తున్నాడు. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్ష పదవి ఒకటికి రెండుసార్లు అప్ప చెప్పాడు. నెల్లూరు జిల్లాలో కష్టమైన ఎన్నిక ఏది వచ్చినా చంద్రబాబుకు మొదట జ్ఞాపకం వచ్చే పేరు సోమిరెడ్డిదైతే, రెండవ వ్యక్తి రవిచంద్ర. ఓటమి తప్పదని తెలిసినా, జేబు ఖాళీ అవుతుందని అర్ధమైనా పార్టీ ఆదేశాన్ని తూచ తప్పకుండా ఆచరించడం ద్వారా రవిచంద్ర చంద్రబాబుకు మరింత మచ్చిక అయ్యాడు. దాని ఫలితమే చిన్న వయస్సులో జిల్లా అధ్యక్ష పదవి.

అయితే దీన్ని నిర్వహించడం అంత సులభమైన పని కాదు. తెలుగుదేశం పార్టీ తీవ్రమైన అస్థిత్వ సమస్య ఎదుర్కొంటున్న సంక్లిష్ట సమయంలో దాన్ని చేపట్టడం అంటే ముళ్ల కిరీటాన్ని కోరి తలకెత్తుకోవడమే. జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి చాలా దయనీయంగా వుంది. చాలా నియోజకవర్గాలలో కార్యకర్తలు నీరసపడిపోయి వున్నారు. రేపటి ఎన్నికలలో కొన్ని స్థానాలకు అభ్యర్థులు దొరుకుతారా అన్న సందేహం కూడా వుంది. ఇప్పటికే రెండుసార్లు ఓటమి చవి చూసి, రేపటి ఎన్నికలలో విజయం పట్ల ఏ మాత్రం నమ్మకం లేని దీనస్థితిలో పార్టీని నడపడం అంటే మాటలు చెప్పినంత సులువు కాదు. చంద్రబాబు మొగ మాటానికి, చంద్రమోహన్‌రెడ్డి ఒత్తిడికి తలొగ్గి ఈ భారం మోయడానికి సిద్ధపడినట్లున్నాడు రవిచంద్ర. ఆ ప్రయత్నంలో ఆయన మరింత పరిణితి కల్గిన రాజకీయవాదిగా తీర్చిదిద్దబడుతాడని ఆశిద్దాం.



నెల్లూరులో జరిగిన అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ డిగ్రీ మరియు పిజి కళాశాలల యాజమాన్య సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి. ప్రక్కన జగన్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మధుసూధన్‌రెడ్డి తదితరులున్నారు.

కుటుంబ కష్టాల కడలి
ఈది ఈది నిస్సత్తువతో
మునిగిపాయ్యావురా!



ఒరే రమణా - (కెవిఆర్‌బాబు)

నీవు ఆఖరి ఉచ్ఛ్వాసం
తీసుకున్నావని తెలపంగానే
అచేతనం అయిపాయ్యానురా.
ఈరోజుకు కళ్ళు తెరిస్తే
నువ్వే మూస్తే నువ్వే
అరవై రెండేళ్ల స్నేహబంధం
ఫోన్ చేస్తే ఒరే వెధవా
ఏమిరా ఇన్నిరోజులు
ఫోన్ చెయ్యలేదని అడిగేవాడివి;
అట్లా అడగ గలిగిన వాడివీ
ఈ లోకంలో నువ్వొక్కడివే.
నిస్వార్థం, నిర్మలత్వం నిండిన
మనస్సు - నిర్ణయం,
నిర్మొగమాటం, ఎవరికీ వెరవని
నీ వ్యక్తిత్వం - మాట పెళుసు
చేత వెన్నపూస.
ఇంత బంధుజనం వుండీ
నీకు కొంచెం కూడా ఆసరా ఇచ్చినోళ్లు
లేకుండాపోయారు దురదృష్టం.
అజ్ఞాతానికి వెళ్లిపోయావు.
ఎందుకు లేరా తలచుకునేకొంది
తట్టుకోలేకుండా వుండాను.
ఆఖరి చూపు లేకుండా పోయింది -
బాధపెడ్తునే వుంది - ఎప్పుడు కలుస్తానో
చెప్పలేను - వుంటారా!

... తూపిలి వనమాలి, నెల్లూరు

దేవేరులకు ప్రీతికరమైన అశ్వీయుజమాసం!



త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల దేవేరులైన సరస్వతి, మహాలక్ష్మి, పార్వతిదేవీలకు అత్యంత ప్రీతికరమైన మాసం అశ్వీయుజ మాసం. వారిని పూజించేందుకు ఇది ఉత్కృష్టమైన మాసం. చాంద్ర మానం ప్రకారం అశ్వీయుజం ఏడవ మాసం. ఈ మాసంతోనే శరదృతువు ఆరంభమవుతుంది. ఈ నెలలో పూర్ణిమ నాడు చంద్రుడు అశ్వనీనక్షత్ర సమీపంలో సంచరిస్తుండడం వల్ల ఈ మాసానికి అశ్వీయుజ మాసం అని పేరొచ్చిందని చెప్తారు. మొత్తం ఇరవై ఏడు నక్షత్రాలలో మొదటి నక్షత్రమే అశ్వని. నక్షత్రాల ప్రకారం తీసుకొంటే అశ్వీయుజ మాసం తొలిమాసం అవుతుంది. జగన్మాత అయిన పార్వతి దేవి దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం తొమ్మిది అవతారాలను ధరించింది ఈ మాసంలోనే. ద్వైత సిద్ధాంత ప్రవక్తయిన మధ్వాచార్యులు, ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి జన్మించింది ఈ నెలలోనే. దుష్ట దానవుడైన నరకాసురుడు అంతమొంది ప్రజలందరికి ఆనంద వెలుగులు పంచిన మాసం కూడా అశ్వీయుజ మాసమే.

శరన్నవరాత్రులను అశ్వీయుజ మాసంలో జరుపుకోవడం వెనుక ఒక విశేషం వుంది. అప్పటివరకు కురిసిన వర్షాల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. చలికాలం మొదలయ్యే సరికి ప్రకృతిలో వచ్చే మార్పుల వలన ఇవి అధికం అవుతాయి. అందుకే శరదృతువును యముడి కోరగా చెప్తారు. ఈ విపత్తు నుంచి తప్పించుకొనేందుకు దేవీ ఆరాధనను ఈ కాలంలో చేస్తారు. ఈ మాసంలో మొదటి తొమ్మిది రోజులకు దేవి నవరాత్రులని పేరు. శరత్కాలంలో వచ్చే రాత్రులు కాబట్టి శరన్నవ రాత్రులు అని కూడా అంటారు. సర్వ జగత్తుకు, త్రిమూర్తులకు సైతం శక్తిని ఇచ్చేది జగన్మాత కాబట్టి ఆ మాత పేరున దసరా నవరాత్రులను చేసి, అమ్మను ఆరాధించడం అనేది ఒక ఆచారంగా మారింది. అజ్ఞానపు చీకట్లను పారద్రోలి లోకానికి వెలుగును, మూర్ఖులకు సైతం వివేకాన్ని ప్రసాదించే తల్లిగా, మనుషుల లోని జడత్వాన్ని తొలగించడంతోపాటు అన్ని రకాల దరిద్రాల నుంచి ఉద్దరించే దేవిగా జగదాంబను శంకరాచార్యులు కీర్తించారు. శంకరులు చేసిన ప్రార్థనను అనుసరించి అమ్మలగన్న అమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ అయిన జగన్మాతను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే అజ్ఞానం తొలగి, వివేకం ప్రాప్తిస్తుందని, సకల శుభాలు కల్గుతాయని అందుకే దసరా పండుగను జరుపుకోవాలని పురాణాలు చెప్తున్నాయి. అశ్వీయుజ శుక్ల దశమి నాటి సాయం సంధ్యలో తారక దర్శన మిచ్చే సమయానికి విజయం అని పేరు. అందుకే ఆనాటి దశమిని విజయ దశమిగా పిలుస్తారు. ఆ సమయంలో తల పెట్టిన ఎంతటి పనైనా తేలిగ్గా పూర్తవుతుందంటారు. అలాగే దశమి నాడు పూజించే అమ్మవారి పేరు అపరాజిత. అంటే ఓడించ శక్యం కానిదని అర్థం. అపరాజితా తల్లి విజయపరంపరకు అనుగ్రహ దేవత. అలాంటి దేవతను దశమినాడు ఆరాధించాలని ధర్మసింధులో పేర్కొనబడింది. దేవతలకు ప్రీతికరమైన అశ్వీయుజ మాసంలో అమ్మవారి ఆరాధనల వెనక, ఆధ్యాత్మిక నేపథ్యాలతోపాటు, విజయ రహస్యాలు, ఆరోగ్య సూత్రాలు, ఎన్నో ఇమిడి వున్నాయి. అందుకే దసరా ఉత్సవాలను దేశవ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకొంటారు.

సభలు - సమావేశాలు

సాగునీటి సలహా బోర్డు ఇచ్చిన సలహా ఏమిటి?

ఎందుకీ సమావేశం ఏర్పాటు చేసినట్లు?

రైతులకు సాగునీరందించేందుకు నిర్వహించిన జిల్లా సాగునీటి సలహాబోర్డు సమావేశం ఎటువంటి తీర్మానం చేయకుండానే ముగిసింది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఈనెల 14వ తేది ఐఏబి సమావేశం జరిగింది. ఖరీఫ్ సాగుకు సోమశిల రిజర్వాయర్ నుండి నీటి విడుదల, జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్యాకేజీ పనులు, సంగం బ్యారేజి, నెల్లూరు బ్యారేజి పొర్లుకట్టల పనులు, డ్రైనేజి, నీటి పారుదలకు సంబంధించిన విషయాలను అజెండాలో చేర్చారు. ఉదయం 10-30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ దఫా వర్షాలు ఆశించిన మేర కురవకపోవడంతో సోమశిల రిజర్వాయర్‌లో నీటి లభ్యత చాలా తక్కువగా వుంది.

ప్రస్తుతం రిజర్వాయర్‌లో 28 టి.ఎం.సిల నీరు నిల్వ వున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో తాగునీటి అవసరాలకు 3 టిఎంసిలు, డెడ్ స్టోరేజ్ 7టిఎంసిలు, నీటి ఆవిరి ప్రవాహ నష్టం క్రింద 1.50 టిఎంసిలు పోతాయి. ఖరీఫ్ సాగుకు 21.835 టిఎంసిలు నీరు విడుదల చేయాలని నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదించారు. అధికారుల లెక్కల ప్రకారం 2లక్షల 42వేల 627 ఎకరాలకు మాత్రమే సోమశిల రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా అవుతుంది. గత ఖరీఫ్‌లో 4లక్షల ఎకరాల వరిపంట సాగు చేశారు రైతులు. ప్రస్తుతం ఖరీఫ్‌లో దాదాపు 3లక్షల ఎకరాలు బీడు భూములుగా మారే ప్రమాదం ఏర్పడనుంది. రిజర్వాయర్‌లో అవసరమైన నీటి నిల్వలు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు.

ఆయకట్టు తగ్గిస్తామని చెబుతున్న అధికారులు నీటి విడుదలపై స్పష్టమైన హామీని ఇవ్వలేకపోయారు. ఈ ఖరీఫ్‌లో సోమశిల రిజర్వాయర్ క్రింద వున్న మొత్తం ఆయకట్టు సాగు చేస్తారు. నీటి కేటాయింపుల్లో ఏ ప్రాంతం వారికి సమస్య ఏర్పడినా రైతుల మధ్య వివాదాలు జరిగే అవకాశం వుంటుంది. ఈ విషయంపై సమావేశంలో చర్చించినా పరిష్కారం చూపలేకపోయారు. మరో నెల తర్వాత తిరిగి ఐఏబి సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. నవంబర్‌లో నిర్వహించే సమావేశంలో నీటి విడుదలపై తీర్మానం చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. నెల రోజుల్లోగా వర్షాలు కురవకపోతే వున్న నీటితోనే సాగు చేయాల్సి వుంటుందన్నారు. ఇందుకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు సహకరించాలని ఆయన కోరారు.

ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరైనప్పటికి నీటి నిల్వలు లేకపోవడంతో పెద్దగా చర్చించలేకపోయారు. జలయజ్ఞం క్రింద చేపట్టిన పనుల గురించి ప్రస్తావించడం జరిగింది. సమావేశంలో గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసా రత్నం, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగరం, రూరల్ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఇరిగేషన్ ఎస్ఇ వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి సలహా బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి. ప్రక్కన జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఏజెసి లక్ష్మీకాంతం.




మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

తలపెట్టిన పనులలో, ఆర్థికస్థితిలో ఏ మార్పులేక నిరుత్సాహం చెందుతారు. ఎంత కష్టపడినా ఆర్థికాదాయం సామాన్యంగానే వుంటుంది. వృత్తి, వ్యాపారాలలోనివారు క్రిందిస్థాయి వారి విషయాలను చూసిచూడనట్లుండడం మంచిది. భాగస్వామ్య రంగాలలోని వారు ఆచితూచి నడవాలి. అయితే క్రయవిక్రయాలకు ప్రాధాన్యత నిస్తారు. ఉద్యోగుల ఖర్చులు అంచనాలకు మించుతాయి.




వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. వృత్తి, వ్యాపారాలలోనివారు, ఇతరులు మధ్యవర్తిత్వాలకు దూరంగా వుండాలి. ఉద్యోగుల శరీరారోగ్యంకై విశ్రాంతి లభిస్తుంది. దైవ, పుణ్యకార్యాలలో పాల్గొంటారు. విద్యార్థులకు తమ సహవిద్యార్థుల వైఖరి మనస్తాపాన్ని కల్గిస్తుంది. కుటుంబ వ్యవహారంలో ఇతరుల సహకారం లభిస్తుంది. వ్యవసాయదారులకు అవసరానికి డబ్బు చేతికందుతుంది.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

తలపెట్టిన పనులకు, సంతానం విద్య, పొదుపు పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తారు. వృత్తి, వ్యాపారాలలోని వారికి అవసరానికి కావలసిన ధనం అందుతుంది. అయితే ఆదాయానికి మించి ఖర్చు చేస్తారు. ఉద్యోగుల అధికార పర్యటనలు, అంచనాలు, ఊహలు ఫలిస్తాయి. విద్యార్థులకు పనిభారం, అనవసర మాటలు పడవలసి వస్తుంది. నిరుద్యోగులకు మంచి అవకాశం.




కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

పనులు చాలా వరకు అనుకూలిస్తాయి. కుటుంబ వ్యవహారాలు, విలువైన వస్తువుల సేకరణకు ప్రాధాన్యతనిస్తారు. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఏకాగ్రత అవసరం. తొందరపాటు నిర్ణయాలు ఇబ్బందులకు గురిచేస్తాయి. విద్యార్థులు కృషితో తమ లక్ష్యాలు సాధిస్తారు. ఉద్యోగులకు అకస్మాత్తుగా బదలీలు, మార్పులు వుంటాయి. రాజకీయులు తమ సంకటం నెరవేర్చుకొంటారు.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

పనులన్నీ సకాలంలో పూర్తవుతాయి. దూర ప్రయాణాలు, ఆత్మీయులతో వేడుకలు, విందులలో పాల్గొంటారు. కుటుంబ వ్యవహారాలలో ఖర్చులధికంగా వుంటాయి. వృత్తి, వ్యాపార క్రయ విక్రయాలు లాభిస్తాయి. వ్యవసాయదారులకు చేసే పనులలో ఆందోళన తగ్గి ప్రశాంతతనిస్తుంది. కళా, క్రీడా రంగాలలోని వారికి వృత్తి సంబంధిత చర్చలు ఫలిస్తాయి. ఆర్థికాదాయం వుంటుంది.



కన్య
ఉత్తర 2,3,4పా., హస్త, చిత్తా 1, 2 పా

గతంలో చేపట్టిన పనులన్నీ పట్టుదలతో శ్రమించి పూర్తి చేస్తారు. ఆర్థికపరమైన నిర్ణయాలు, పెట్టుబడులలో ఆదాయ పెరుగుదల వుంటుంది. విద్యార్థులు అడ్మిషన్లతో ఉత్సాహంగా వుంటారు. ఉద్యోగస్తులు పారితోషికాలు, బిల్లులు అందుకొంటారు. వ్యవసాయదారులు అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. కళా, క్రీడా రంగాలలోని వారికి వృత్తిపరమైన చిక్కులు .

వారఫలాలు

తేది 20-10-2012 నుండి 26-10-2012 వరకు వృషభంలో గురు, కేతువులు; 23తేది సింహంలో శుక్రుడు తదుపరి కన్యలో; తులలో రవి, శనులు; 23తేది వరకు బుధుడు తులలో తదుపరి వృశ్చికంలో; వృశ్చికంలో కుజ, రాహువులు; వృశ్చిక, ధనుర్మకర, కుంభాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

20తేది సరస్వతి పూజ.
21తేది దేవీ త్రిరాత్ర వ్రతం.
22తేది దుర్గాష్టమి, రాత్రి సరస్వతీ ఉద్వాసనం.
23తేది మహర్ణవమి, సువాసినీ పూజ.
24తేది విజయదశమి – శమీ పూజ.
26తేది పద్మనాభ ద్వాదశి, గోవత్స ద్వాదశి. బక్రీదు పండగ.

శుభ ముహూర్తాలు

22, 24, 25, 26తేదీలలో వివాహాది, గృహప్రవేశ, అక్షరస్వీకార, అన్నప్రాసన, సీమంత, ప్రతిష్టాదులు, అనురాగ సంస్కారాలకు శుభ ముహూర్తాలున్నాయి.

అక్టోబర్ తిథులు
ఆశ్వయుజ శుద్ధ

20	శని	షష్ఠి	రా 11.35	గం.ల.వ
21	ఆది	సప్తమి	రా 09.44	గం.ల.వ
22	సోమ	అష్టమి	రా 08.24	గం.ల.వ
23	మంగళ	నవమి	సా 07.36	గం.ల.వ
24	బుధ	దశమి	సా 07.21	గం.ల.వ
25	గురు	ఏకాదశి	సా 07.37	గం.ల.వ
26	శుక్ర	ద్వాదశి	రా 08.22	గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

నూతన ప్రయాణ ఏర్పాట్లకు, ఆర్థికపరమైన నిర్ణయాలకు, సభలు, సమావేశాలకు ఈ వారం అనుకూలం. కొన్ని సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుంది. కోర్టు వ్యవహారాలనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆర్థికంగా బాగున్నా తమ లక్ష్యాలు నెరవేరకపోవచ్చు. రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థుల ఉన్నత విద్య, విదేశీ ప్రయాణాలు, విద్యా సంబంధ సమావేశాలకు ప్రోత్సాహకరం.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

గతం కంటే మేలనిపిస్తుంది. అయితే ఆలోచనలు పలు విధాలుగా వుంటాయి. మనస్థిమితం వుండదు. వృత్తి, వ్యాపారాలలో సామాన్య లాభాలే వుంటాయి. రుణ ప్రయత్నం ఫలిస్తుంది. ఉద్యోగులు పైవారినుండి మాట పడవచ్చు. విద్యార్థులలో క్రమంగా ఏకాగ్రత నెలకొంటుంది. కుటుంబ సభ్యులలో ఒకరి గురించి ఆవేదన కల్గిస్తుంది. ఇంటియందు విలువైన వస్తువులు, నగదుపై జాగ్రత్తలవసరం.




ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

తలపెట్టిన పనులలో ఆర్థిక విషయమై ఆచితూచి వ్యవహరించాలి. ఆధ్యాత్మిక దృక్పథం అవసరం. వృత్తి, వ్యాపారాలలోని వారు పురోభివృద్ధి సాధిస్తారు. అయితే అనుకోని కొన్ని సంఘటనలు ఆందోళన కల్గిస్తాయి. ఉద్యోగులకు బాధ్యతల మార్పు, పనిభారం నుంచి విముక్తి లభిస్తుంది. నిరుద్యోగులు ఉపాధి పథకాలలో స్థిరపడతారు. విద్యార్థుల విద్యావకాశాలు మెరుగౌతాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

గతంలో చేపట్టిన, వాయిదా పడిన పనులు పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపార క్రయవిక్రయాలు, నూతన పెట్టుబడులకు అనుకూలం. అయితే సంతాన విషయమై కొంత ఆందోళన కల్గిస్తుంది. విద్యార్థులు పెద్దల సహకారంతో తమ లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయదారులకు ప్రోత్సాహకరంగా వుంటుంది. కళా, క్రీడా రంగాలవారు వృత్తిపరమైన ఒత్తిళ్ల కారణంగా ఇతరులకిచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోలేరు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

కొన్ని రోజులుగా మిమ్మల్ని బాధిస్తున్న విషయాలు సానుకూలిస్తాయి. మీ వ్యవహార దక్షతకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగాల వారి ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. వ్యవసాయదారులు చేసే రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కళా, క్రీడా రంగాలవారు ప్రముఖులతో సమావేశాలు, కొత్త ప్రాజెక్ట్‌లు, మార్పుచేర్పులు సంబంధ చర్చలు ఫలిస్తాయి. రాజకీయుల అంచనాలు ఫలించకపోవచ్చు.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

పనులలో ఆర్థికపురోగతి సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలోనివారు పెట్టుబడులు, వృత్తిపరమైన సమావేశాలకు ప్రాధాన్యతనిస్తారు. ఆర్థిక ప్రయత్నాలు లాభిస్తాయి. నూతన గృహనిర్మాణాలకు రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షలలో ఏకాగ్రత అవసరం. విద్యార్థులకు సాంకేతిక విద్యలలో ప్రవేశం లభిస్తుంది. వ్యవసాయదారులు చేసే పనులలో మార్పులు ఫలిస్తాయి.

ద్వాదశభావ దోషకారకాలు 'సర్పదోష' వేధలు!

ప్రయాగశాస్త్రి వి *జొన్నవాడ*

** 'సర్పదోషం' ఎట్లా ఏర్పడుతుంది?*

పంచమ భావదోషాల్ని శాస్త్రం సర్పదోష మంటున్నది. అయితే సప్తర్షుల ప్రకారం ద్వాదశ భావ దోషాలు సర్పదోషమవుతున్నవి. ఉదా: పంచమ సంతాస్థానంలో రాహువు కుజుడి చూపుకు గురికావడాన్ని సర్పదోషమంటారు. ఇలాంటి పన్నెండు దోషాలు కూడా సర్పదోషాల క్రిందే లెక్క.

ఎన్.రేవతి *చిత్తూరు*

** 'షష్ఠాష్టకం' అంటే ఏమిటి?*

ఒక రాశి నుంచి మరొకరి రాశిని లెక్కించినపుడు ఆరు, ఎనిమిది సంఖ్యలు రావడాన్ని 'షష్ఠాష్టకం' అంటారు.

పి.డి.ఆర్ *కోట*

** ఆమె మా కుటుంబాన్ని అవమానపరచింది. క్షమించడం కలలోని మాట.*

మానసిక, శారీరక వేధింపులున్న ఏ స్త్రీ అయినా పోలీసులకు ఫిర్యాదు చేస్తుంది. ఆమె చేసింది కరెక్టే. 'శని' శత్రుస్థాన పీడన మీ అబ్బాయిది. ఆమెది కాదు.

పి.ధనలక్ష్మమ్మ *గూడూరు*

** రోగాలు లేక ఆర్థిక పరిస్థితులు బాగుగా ఉండే ఉపాయం చెప్పండి?*

వాస్తు పరంగా గృహ నిర్మాణం చేయండి. అది పంచభూత ప్రవేశానికి అనువుగా ఉండాలి. ఉత్తర దోషాలు లేని పక్షంలో ఆర్థికంగా సుభిక్షంగా ఉంటారు.

మంది శివన్నారాయణ *సికింద్రాబాద్*

** నేను అమెరికాలో 'నెట్'లో మీ ప్రశ్న జవాబులు చదివాను. అంత సీరియస్‌గా జవాబులివ్వాలా?*

శాస్త్రం మహామహులు నిర్దుష్ట సూత్రాలతో వ్రాశారు. నిర్ణయాలు కఠినంగా చెబితేనే అవతలి వాళ్ల జీవితాలు బాగుపడతాయి.

పురుషోత్తం సి *కొత్తపేట*

** అదృష్టమే గొప్పదనిపిస్తోంది. కొందర్ని చూస్తూ వుంటే?*

దాని వెనుక వారి కృషిని మీరు గమనించడం లేదు. అదృష్టమంటే అవకాశము, రాశి, నక్షత్ర బలం ఆ సమయానికి ఏర్పడడమని అర్థం.

ఎం.యాదగిరి *హైదరాబాద్*

** 'యంత్ర ప్రతిష్ట' తర్వాత మంచిగుండాము.*

యంత్ర సారస్వతాన్ని పూర్తిగా చదివి అవగాహన చేసుకున్న వారెవరైనా నాలాగే సలహా ఇస్తారు. 'సుదర్శన యంత్రం' మంచిదే! అయితే అది మీలాంటి వారికి మాత్రమే సరిపోతుంది.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

ఎఫ్.రమామణి *రాజమండ్రి*

** ఇంట్లో నిత్యం దారిద్ర్యం తాండవిస్తోంది. అమ్మ మరణించింది. సమస్యకు పరిష్కారం చెప్పండి?*

మీ గృహంలో తూర్పు, ఉత్తరాలకంటే దక్షిణ పశ్చిమాల గోడలు పొట్టిగా ఉన్నాయి. దీన్ని 'ఋతువేధో దోషం' అంటారు.

ఎన్.బి.కె.ఆర్ *ఆత్మకూరు*

** జాతకంలో నాకు 'రెండో పెళ్లి' ఉందని చెప్పారు.*

ఈ కలి, కరవుకాలంలో రెండో పెళ్లి ఆలోచనలు మానుకోండి. ఆలోచనలతో పండంటి సంసారాన్ని నాశనం చేసుకోకండి. మీకున్నది కుజ దోషం. రెండో పెళ్లి యోగం కాదు!

డా॥ అరవింద్ *చెన్నై-17*

** కలిమిలేములు శాశ్వతమా?*

అగస్త్యమహర్షి భవిష్యవాణిలో ప్రారబ్ధం, సమయ ఫలం, దైవకృపలను గురించి చక్కగా వ్రాశారు. మీరాగ్రంథం చదవండి. ఏదీ శాశ్వతం కాదనే విషయం మీకు బోధపడుతుంది.

అరుణిమారెడ్డి సి *దిగువమాఘం*

** రుద్రాక్ష ఫలమా? వాటి గురించి చెప్పండి?*

రుద్రాక్షలు వృక్ష ఫలాలే! నాకు తెలిసి ద్వాదశ ఫలాల రకాలు (పన్నెండు) అందులో వున్నాయి. అన్నీ ప్రశస్తమైనవి. ఏది గొప్ప, తక్కువ కాదు. పత్రాలు మారేడు ఆకుల్లా వుంటాయి.

రూపురేఖలు కోల్పోతున్న ఆర్‌అండ్‌బి రోడ్లు!

జిల్లాలో రోడ్లు, భవనాలశాఖ పరిధిలో వున్న రహదారులు అధ్వాన్నంగా వున్నాయి. ప్రతి సంవత్సరం రహదారుల మరమ్మత్తులు, నిర్మాణం కోసం రాష్ట్రప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నా రహదారుల పరిస్థితి మాత్రం అలాగే వుంటుంది. నెల్లూరు, కావలి, గూడూరు డివిజన్లలో ఈ శాఖకు సంబంధించిన డిప్యూటి ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉన్నప్పటికి సరైన పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. రహదారులు సక్రమంగా లేకపోవడంతో ఆర్టీసి బస్సులు పంపకుండా అధికారులు నిలిపివేసిన సందర్భాలు లేకపోలేదు. గతంలో పంచాయితీరాజ్‌శాఖ పరిధిలో వున్న అనేక రహదారులను ఆర్‌అండ్‌బిలో విలీనం చేయడం జరిగింది.

ఆర్‌అండ్‌బి పరిధిలోకి వెళ్లిన రహదారులు గురించి సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం మానేశారు. కోట్ల రూపాయల వ్యయంతో వేసిన తారురోడ్డు మూడు నెలలు కూడ వుండకుండా మరమ్మత్తులకు గురికాబడుతున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నాసిరకం మెటీరియల్స్‌ను రోడ్డు నిర్మాణాల కోసం వినియోగిస్తున్నారు. కాంట్రాక్టు ఉత్తర్వులు పొందిన దగ్గర నుంచి బిల్లులు మంజూరు చేసేవరకు ప్రతి ఒక్కరు కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు స్వీకరించడం ఆనవాయితీగా మారింది. మామూళ్లు ఇస్తున్నాం కదా అన్న ధీమాతో కాంట్రాక్టర్లు పైపైనే పనులు చేస్తున్నారు. అధికారుల ఉదాసీనత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడకతప్పడం లేదు.

2009-10, 2010-11 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కోట్ల రూపాయల నిధులు విడుదల య్యాయి. నాబార్డు, సెంట్రల్ రిజర్వుఫండ్, రాజీవ్ పల్లెబాట, 12వ ఆర్థిక సంఘం నిధులు, హడ్కో ఆర్ఎస్.ఐ నిధులు దాదాపు 50కోట్లకు పైగా మంజూరయ్యాయి. ఈ నిధులన్ని కూడా రహదారుల నిర్మాణం, మరమ్మత్తుల కోసం ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఏ మండలంలో ఎక్కడ నుంచి ఎక్కడ వరకు రోడ్డు నిర్మాణం, మరమ్మత్తులు చేపట్టారన్న దానిపై పూర్తి వివరాలు వెల్లడించలేక పోతున్నారు. పనులు పూర్తి చేశామని చెబుతున్న అధికారులు ఎటు వంటి పనులు, చేసిన కాంట్రాక్టర్ ఎవరన్నది చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. 2008 సంవత్సరంలో చిల్లకూరు క్రాస్ రోడ్డు నుంచి కోట వరకు దాదాపు 20 కోట్ల రూపాయలతో తారు రోడ్డు నిర్మించారు. రెండు సంవత్సరాలకే ఈ రోడ్డు మరమ్మత్తులకు గురైంది.


ప్రస్తుతం ఈ రోడ్డుపై వాహనంలో ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు. ముఖ్యంగా చిల్లకూరు క్రాస్‌రోడ్డు నుంచి తిక్కవరం వరకు రోడ్డుపై పెద్ద గుంటలు పడ్డాయి. ఈ రహదారి వెంట వున్న గ్రామాల ప్రజలు అత్యవసరంగా వెళ్లాలంటే పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ రోడ్డు దుస్థితికి చేరుకున్న విషయం ఆర్‌అండ్‌బి అధికారులకు తెలిసినా మరమ్మత్తులు కూడా చేపట్టలేక పోతున్నారు.

మస్తుకు మస్తు రోడ్డు పరిస్థితి

నగరంలో రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి ధనలక్ష్మిపురం వరకు చేపట్టిన నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం నాసిరకంగా జరుగుతోంది. ఈ రోడ్డు విస్తరణ కోసం 20 కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల విస్తరణ పనులకు వినియోగిస్తున్న మెటీరియల్ నాసిరంగా వుంటుంది.

మూడు నెలల క్రితం ఇదే రహదారిపై వడ్డిపాళెం- ధనలక్ష్మీపురం మధ్యలో వున్న పెట్రోల్ బంకు వద్ద రోడ్డు మధ్యలో రెండు గుంటలు పడ్డాయి. వీటిని గతవారంలో కాంట్రాక్టర్ తారుతో మరమ్మత్తులు చేయించాడు రోడ్డు నిర్మాణం మొత్తం పూర్తి కాకముందే వేసిన రోడ్డుపై గుంటలు పడుతున్నాయంటే పనులు ఎలా చేస్తున్నారో ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు రహదారుల నిర్మాణాలను తనిఖీ చేస్తే బాగుంటుంది.







మంచి మనస్వినీ!



తారగా వెలుగొందడం మాత్రమే జీవితానికి పరమావధి కాదంటోంది ప్రియా ఆనంద్. లీడర్ చిత్రంతో తెరంగేట్రం చేసిన ప్రియ ఇప్పుడు హిందీలోనూ అవకాశాలు పొందుతుంది. శ్రీదేవితో కలసి ఇంగ్లిష్ వింగ్లిష్ చిత్రంలో నటించింది. ఓ వైపు నటిస్తూనే మరో వంక సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటోంది. ఇటీవలే నలందవే ఆఫ్ ఫౌండేషన్‌తో చేతులు కలిపింది. ఆ సంస్థ ద్వారా పాఠిక మంది చిన్నారులకు చదువు చెప్పించేందుకు ప్రియ సంసిద్ధత వ్యక్తం చేసింది. అంతే కాదు అందుకు అవసరమైన నిధుల్నీ అందజేసింది. ఈ విషయమై వివరిస్తూ ఈ మధ్యనే నాకు పాఠికేళ్లు నిండాయి. ఆ పుట్టిన రోజుని గుర్తు పెట్టుకొనేలా ఏదైనా చేయాలనుకొన్నాను. విద్యాదానం విలువను అందరికీ చెప్పేలా పాఠిక మందిని చదివించాలని నిర్ణయించుకొన్నానంది ప్రియ.



కొత్త కాబట్టే తీసుకొన్నారు!

మిగతా యువ హీరోలతో పోలీస్తే రామ్‌చరణ్‌కు బాలీవుడ్‌లో ఎంట్రీ కాస్త తొందరగా లభించింది. అమితాబ్ నటించిన జంజీర్ సినిమాను రామ్‌చరణ్ హీరోగా రీమేక్ చేస్తున్నారు. ఈ అవకాశం ఎలా వచ్చిందని రామ్‌చరణ్‌ను అడిగితే సమాధానంగా ఓ క్లాసిక్ సినిమాను రీమేక్ చేయాలనుకొన్నప్పుడు అనుభవం ఉన్న కథానాయకులు, మాస్ ఇమేజ్ ఉన్న హీరోల వెంట పడతారు. నాకెలా అవకాశమిచ్చారని జంజీర్ దర్శకుడిని అడిగాను. దానికి ఆయన సమాధానం చెప్పారు. మాకో తెల్ల కాగితం లాంటి హీరో కావాలనీ మిమ్మల్ని తీసుకొన్నామన్నారు. ఆ మాట నిజమే అనిపించింది. నేనిక్కడ స్టార్ కావచ్చు. బాలీవుడ్‌కు కొత్తే. కానీ మగధీర చూసిన అమీర్‌ఖాన్, అమితాబచ్చన్, సల్మాన్‌ఖాన్‌లు నన్ను అభినందించారు. ఈ చిత్రమే నన్ను బాలీవుడ్‌లో నటించే అవకాశాన్ని తెచ్చి పెట్టిందంటున్నాడు రామ్‌చరణ్.

ఘాటు సోనాక్షి!



మిరపకాయ్ కాస్త పంటి కింద పడిందంటే చాలు అబ్బా మంట అంటూ నోరెళ్లబెడతాం. నీళ్లు ఎక్కడా? అంటూ పరిగెడతాం. అలాంటిది పది మిరపకాయల్ని ఏకధాటిగా నమిలేసింది సోనాక్షి. దీనికంతటికీ కారణం అక్షయ్‌కుమార్. సహచర నటీనటులతో సరదాగా గడపడం అక్షయ్‌కు అలవాటు. ఇటీవల ఓ హిందీ చిత్రం షూటింగ్ కోసం పాటియాల వెళ్లిన అక్షయ్ సెట్లో ఉన్న సంజయ్‌దత్‌తో సోనాక్షి సిన్హా పది మిరపకాయలు తినేస్తుందని పందెం కాశాడట. విషయాన్ని విన్న సోనాక్షి మారుమాట్లాడలేదు. ఎర్రగా నిగనిగలాడే పది మిరపకాయల్ని కసకసా నమిలి మింగేసిందట. అది చూసి సెట్‌లో వారంతా అవాక్కయ్యారు. ఎలా తిన్నారు అంత కారం అంటే? నా బాధ ఎవరికి తెలుసు. అందరి ముందు కారానికి అరవలేకపోయాను. ఎన్ని బాటిళ్ల నీళ్లు తాగానో చెప్పలేను. ఆ తర్వాత అక్షయ్, సంజయ్‌దత్ ఐస్‌క్రీములు తెచ్చి ఇచ్చి సర్దబెట్టారంది.

శివాజీ చూడను జపాన్‌కు...



తన కెరీర్‌లో శివాజీ ప్రత్యేక చిత్రమంది హీరోయిన్ శ్రియ. ఆ చిత్రంతో నాకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు. ఇప్పుడు శివాజీ త్రీడీలో మార్చడం సంతోషంగా ఉంది. త్రీడీలో నేనేలా ఉంటానో? అనే ఉత్సుకత పెరిగింది. అందుకే ఈ సినిమాను చూడను జపాన్ వెళ్తున్నా. టోక్యోలో ఈ సినిమా చూస్తానని వివరించింది శ్రియ.

సినీ పరిశ్రమలో స్నేహితులు తప్ప శత్రువులు లేరంటుంది హీరోయిన్ అమలాపాల్. నాయక్ సినిమాలో అమలాపాల్, తమన్నా కలసి నటిస్తున్నారు. షూటింగ్‌లో ఎలా సర్దుకుపోయారంటే; అలాంటి అవసరమేమిటి? ఇద్దరి మధ్యా భేదాభిప్రాయాల్లేవు. తమన్నా మంచి నటి. స్నేహ పూర్వకంగా ఉంటుంది. నేనేమైనా తప్పులు చేస్తే చెబుతుంది. నేను వాటిని సరిచేసుకొంటాను. ఆమెను చూసే నేను డ్యాన్స్ నేర్చుకోవాలనే భావనకు వచ్చాను. నా కెవరితోనూ పోటీ లేదు. త్రిష కూడా నా స్నేహితురాలే నని అమలాపాల్ అంది.

మై బెస్ట్ ఫ్రెండ్



తమిళ తెరపై తెలుగు కథలు!

తమిళం నుంచి చిన్న చితకా చిత్రాలు కూడా దిగుమతై తెలుగుకు వచ్చేస్తుంటాయి. మనవి ఆడపాదడపానే అటు వెళ్తుంటాయి. ఇటీవల కొందరు దర్శక, నిర్మాతలు ద్విభాషా చిత్రాలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం మూడు చిత్రాలు ఈ తరహాలోనే రూపొందుతున్నాయి. మంచు లక్ష్మీ ప్రసన్న నిర్మించి, నటిస్తున్న చిత్రం 'గుండెల్లో గోదావరి'ని తమిళంలో 'మరణితెన్ మన్నిత్తేన్' పేరుతో అనువదిస్తున్నారు. ఇందులో హీరో పినిశెట్టి, హీరోయిన్ తాప్సీలు, వేదం సినిమాను తమిళంలోనూ రీమేక్ చేసి అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకొన్న క్రిష్ తాజా చిత్రం 'కృష్ణం వందే జగద్గురుమ్'ను తమిళంలో ఓంకారం పేరుతో అనువదిస్తున్నారు. నయనతార, రానా హీరోయిన్, హీరోలు. తమిళంలోనూ పట్టున్న శర్వానంద్ చిత్రం 'కో అంటే కోటి' కూడా తమిళంలో విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ ప్రియా ఆనంద్‌కు కూడా తమిళంలో మంచి గుర్తింపు ఉంది.

తెలుగులో సుదీప్



ఈగ సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన కన్నడ కథానాయకుడు సుదీప్. దీనిలో ఆయన పలికించిన హావభావాలు అటు యువతను, ఇటు మాస్‌ను అలరించాయి. దీంతో గతంలో సుదీప్ నటించిన కన్నడ చిత్రాలను ఇక్కడ దిగుమతి చేస్తున్నారు. అయితే సుదీప్ వీటిపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. నేరుగా తెలుగు, తమిళ చిత్రాలు చేసే ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు దర్శక, నిర్మాతలు సుదీప్‌ను సంప్రదించారు. త్రీడిలో రూపొందుతున్న యాక్షన్ చిత్రంలో ఆయన ప్రత్యేకపాత్ర పోషిస్తున్నారు. అల్లరి నరేష్, వైభవ్, శ్యామ్, రాజు, సుందరం ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనిల్ సుంకర దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సుదీప్ పోషించే పాత్ర కథలో కీలకమైనదంటున్నారు.

సిద్ధు ఖవ్వాలీ



80వ దశకంలో తెలుగు చిత్రాల్లోనూ ఖవ్వాలీ పాటలుండేవి. హిందీ సంగీత ప్రభావంతో ఇవి మన దగ్గరకు వచ్చాయి. మరోసారి ఈ ఖవ్వాలీ బాణీలు వినిపించే ప్రయత్నం చేస్తున్నాడు నెల్లూరీయుడు సంగీత దర్శకుడు తమన్. హీరో సిద్ధార్థ్ నటించే ఈ చిత్రంలో ఖవ్వాలీ పాట ఉంటుంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం సమకూర్చే పనిలో ఉన్నారు. ఈ పాటను హీరో, హీరోయిన్లు సిద్ధార్థ్, సమంతలపై దుబాయ్‌లో చిత్రీకరిస్తామని దర్శకురాలు నందినిరెడ్డి చెప్పింది.

హీరోగా శ్రీనివాసరెడ్డి



హాస్యనటులు హీరోలుగా ప్రమోషన్ పొందడం తెలుగులో మామూలే. రాజబాబు కాలం నుంచి ఈ ఒరబడి ఉంది. సునీల్ హీరోగా స్థిరపడిపోయాడు. ఇప్పుడీ జాబితాలో శ్రీనివాసరెడ్డి చేరబోతున్నాడు. బాలాజీ అనే నూతన దర్శకుడు తీసే చిత్రంలో శ్రీనివాసరెడ్డిని హీరోగా అనుకొన్నారట. ఈ చిత్రానికి బెల్లంకొండ సురేష్ నిర్మాత. కథారచన ప్రస్తుతం జరుగుతుంది.

గుండమ్మ కథకు రెడీ



గుండమ్మ కథ రీమేక్‌పై చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ఎన్టీఆర్, నాగచైతన్య నటిస్తే బాగుంటుందని ప్రేక్షకుల అభిప్రాయం. ఇదే విషయాన్ని నాగచైతన్యను అడిగితే గుండమ్మ కథ చుశావా? అని నన్ను ఎన్టీఆర్ అడిగాడు. ఆయన కోసమే ఈ సినిమా చూశా. విపరీతంగా నచ్చింది. ఈ సినిమా రీమేక్‌లో నేను, ఎన్టీఆర్ కలసి నటిస్తాం. అయితే మంచి దర్శకుడు దొరకాలి. గుండమ్మ కథ ఓ క్లానిక్. ఇలాంటి సినిమాలు చేస్తున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలంటున్నాడు ఈ యువ హీరో.

సిఐల బదలీలకు ఆటంకాలు



బదలీలు ఎప్పుడు జరిగేనో?

సాధారణంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు స్థాన చలనం కల్గుతుంటుంది. పనిచేసే ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి బదలీ జరగడం సహజం. కానీ ఏ శాఖల్లో లేనంతగా పోలీస్ శాఖలో సిఐల బదలీల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ బదలీలు మొదటి నుంచి వివాదాస్పదంగా మారడంతో బదలీలు జరగడం, తిరిగి వాటికి బ్రేక్ పడుతుండడంతో పోలీస్ శాఖ పలుచన అవుతోంది. గతంలో జరిగిన బదలీలపై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు వాటిని రద్దు చేశారు. తాజాగా మరో జాబితా రూపొందించి బదలీలు చేసినా, అందులో స్పష్టత లేకపోవడం, ప్రజాప్రతినిధులకు తెలియకుండా బదలీలు చేశారన్న కారణాలతో తిరిగి ఈ బదలీలను రద్దు చేయడంతో గుంటూరు రేంజ్ పరిధిలో గల సిఐల బదలీల వ్యవహారం చిత్రవిచిత్రంగా మారుతోంది. సెప్టెంబర్ నెల మొదటి వారంలో జరిగిన సిఐల బదలీల్లో భారీస్థాయిలో అవినీతి జరిగిందని, గుంటూరు రేంజ్ ఐజిగా ఉన్న హరీష్‌కుమార్ గుప్తా ఇష్టానుసారంగా బదలీలు చేశారన్న ఆరోపణలు రావడంతో డిజిపి దినేష్‌రెడ్డి ఈ బదలీలను నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వడంతోపాటు విచారణకు ఆదేశించారు. ఐజి రాజేంద్రనాథ్‌రెడ్డి, అదనపు డిజి ఎస్ఎం హుడాలు దీనిపై విచారించగా అక్రమాలు వాస్తవమని తేలాయి. వీటిపై ఎలాంటి చర్యలు లేకపోగా, తాజాగా మరోసారి సిఐలను బదలీలు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అక్రమాలకు తావు లేకుండా బదలీలు జరపాలని, సర్వీస్ ట్రాక్‌ను పరిశీలించాలని, లూప్‌లైన్‌లో పనిచేయని వారిని కచ్చితంగా లూప్‌లైన్‌కు పంపాలని, అక్కడ పనిచేసే వారిని మెయిన్ లైన్‌కు బదలీ చేయాలని ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో జరిగిన సిఐల బదలీలు మరోసారి ఆగిపోయాయి. దీనికి కారణం అధికారులు విడుదల చేసిన జాబితాలో స్పష్టత లేకపోవడం ఒకటైతే, ప్రజాప్రతినిధులు ఈ బదలీలపై అసంతృప్తితో ఉండడం మరొక కారణం. బదలీల్లో పారదర్శకత లేదన్న విమర్శలు వస్తున్నాయి. బదలీ జాబితాలో కొందరు సిఐలకు పోస్టింగ్ ఎక్కడనేది చూపకపోవడం, గతంలో బదలీలు జరిగిన ప్రాంతాలకే తిరిగి పోస్టింగ్ ఇవ్వడం, తదితర అంశాలపై విమర్శలు చెలరేగడంతో ఈ బదలీలను నిలుపుదల చేస్తూ డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావడంతో వీటికి బ్రేక్ పడింది.

కదంతొక్కిన మహిళలు


బిజెపి మహిళా మోర్చా సభ్యుల నిరసన.

గ్యాస్ సిలిండర్లపై రాయితీని ఎత్తివేస్తామని కేంద్రం ప్రకటించినందుకు నిరసనగా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ వద్ద ధర్నా నిర్వహించారు. సంవత్సరానికి ఆరు రాయితీ సిలిండర్లు, రాయితీ లేకుండా మరో మూడు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా వ్యాప్తంగా రాజకీయ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్‌డిఏ అధికారంలో ఉన్నప్పుడు వంట గ్యాస్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా జరిగిందన్నారు. ప్రస్తుత యుపిఏ ప్రభుత్వం వంట గ్యాస్‌పై రాయితీ ఎత్తివేసి పేద ప్రజలపై ఆర్థిక భారం వేస్తుందని విమర్శించారు. భవిష్యత్తులో పేద ప్రజలకు వర్తింపజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సైతం రద్దుచేసే అవకాశం లేకపోలేదని ఆమె ధ్వజమెత్తారు. ఈ ధర్నాలో పాల్గొన్న మహిళలు కట్టెలు, గ్యాస్ సిలిండర్లతో ప్రదర్శనగా వచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు బుజ్జమ్మ, జీవరత్నం, బిజెపి నేతలు మిడతల రమేష్, ఈశ్వరయ్య, రోశయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కె.సి.రెడ్డి.

అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ

జిల్లాలో ఏర్పాటైన వివిధ పరిశ్రమల్లో గ్రామీణ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాల్లో చేయూతనిచ్చేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తుంది. ఇటీవల రాజీవ్ విద్యామిషన్, ఉపాధి మండలి చైర్మన్ కె.సి.రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఉపాధి అవకాశాలకు చేపడుతున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్, డిఆర్‌డిఏ పిడి, పట్టణ ఇందిర క్రాంతి పథం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది పదవ తరగతి వరకే సరిపెట్టుకుంటున్నారు. విద్యను మధ్యలో నిలిపివేసిన వారిని గుర్తించి వత్తి విద్యలో శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వివిధ శాఖల సమన్వయంతో నవంబర్ ఆఖరులోగా అంతర్జాతీయ ప్రమాణాలకు తగినవిధంగా వెల్డింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అందుకు అభ్యర్థుల వివరాలు సేకరించి అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న వివిధ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. పరిశ్రమల ప్రతినిధులతో తరచూ సమావేశాలు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలపై చర్చించాలన్నారు.

పూండ్ల వెంకురెడ్డి దాతృత్వం!


స్మశాన శకటాన్ని ప్రారంభిస్తున్న పూండ్ల వెంకురెడ్డి.

ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందుండే ప్రముఖ కాంట్రాక్టర్ పూండ్ల వెంకురెడ్డి మరోసారి తమ దాతృత్వాన్ని, సేవానిరతిని చాటుకొన్నారు. పూండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్టు తరపున పది లక్షల రూపాయలు విలువచేసే స్మశాన శకటాన్ని ఆయన ఉచితంగా అందజేశారు. గతంలో రెండు వాహనాలను అందించి ఉన్న పూండ్ల వెంకురెడ్డి మూడో వాహనంగా దీనిని సమకూర్చారు. ఈ వాహనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమన్నారు. పది మందికి ఉపయోగపడే ఏ పనికైనా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పివిఆర్ గ్యారేజ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపును దెబ్బతీసిన ఆకుపసరు

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా కంటి చూపు మెరుగుకోసం ఆకు పసరు పోయించుకుంటే ఉన్న చూపు కోల్పోవాల్సిన పరిస్థితి కలిగింది. ఇందుకు ఉదాహరణగా తోటపల్లి గూడూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలను పేర్కొనవచ్చు. ఈ మండలంలోని వరిగొండ, మల్లిఖార్జునపురం, సాలిపేట తదితర గ్రామాలకు చెందిన వారికి కంటి చూపు మందగించింది. ఆకుపసరు పోయించుకుంటే చూపు మెరుగ్గా వుంటుందని కొందరు చెప్పిన మాటల్ని నమ్మారు. దీంతో కర్నూలు జిల్లా తంబళ్లపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ నాటు వైద్యుడి చేత కళ్లలో ఆకు పసరు పోయించుకొన్నారు. ఆకుపసరు పోయించుకున్న వారం తర్వాత కళ్ల నుంచి నీరు కారడం ప్రారంభమైంది. దాదాపు 70 మందికి పైగా పసరు పోయించుకుంటే వీరిలో 50 మందికి కళ్లలో నుంచి నీరు వస్తుంది. దీంతో ఆందోళన చెందిన బాధితులు నగరంలో కంటి వైద్యులను సంప్రదించి పరీక్షించుకోగా ఆకుపసరు పోసినందున నీరు కారుతుందని వైద్యులు చెప్పారట. ఆకుపసరు ప్రభావంతో కార్నియా కొంతమేర దెబ్బతిందని వైద్యులు నిర్ధారించారు. నాటు వైద్యం చేయించుకున్న వారందరూ పేద కుటుంబాలకు చెందిన వారే. వీరిని ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది.

ఆకట్టుకొంటున్న సర్కస్

నగరవాసులకు వినోద కాలక్షేపం కోసం ఎస్ఎఎమ్ వారి సర్కస్ ప్రదర్శన ప్రారంభమైంది. వైఎంసిఏ గ్రౌండ్‌లో ఏర్పాటైన ఈ సర్కస్‌ను రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి అక్టోబర్ 12న ప్రారంభించారు. దేశంలో వివిధ సర్కస్ కంపెనీలు ఉండగా ఇక్కడ ప్రారంభమైన సర్కస్ చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన వారిది కావడం విశేషం. సత్య అనసూయ మాతా(ఎస్ఎఎమ్) పేరుతో ప్రదర్శింపబడుతున్న ఈ సర్కస్‌లో పలు విన్యాసాలు, ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకొనేలా ఉన్నాయి. చైనీస్ కళాకారుల కత్తుల విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉండగా, మణిపూర్, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం కళాకారుల స్టిక్ జగ్లింగ్, హుల్లా హప్ డ్యాన్సులు, శారీ బ్యాలెన్స్‌లు, రష్యన్ రింగ్ డ్యాన్స్, ఒకటిన్నర అడుగు జోకర్ల కడుపుబ్బ నవ్వించే విన్యాసాలు, థ్రిల్లింగ్ దృశ్యాలు, ఏనుగులు, ఒంటెలు, కుక్కలు, గొర్రెల విన్యాసాలు ఇలా రకరకాల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకొనేలా ఉన్నాయి. ఈ సర్కస్ ప్రదర్శన గురించి నిర్వాహకులు రామ్‌రాజ్, దేవరాజ్, బాబు మాట్లాడుతూ దేశంలోని ఇతర ఏ కంపెనీల సర్కస్‌కు తీసిపోకుండా ఆధునిక శైలిలో సర్కస్ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


నెల్లూరు జిపిఆర్ కళ్యాణ మండపంలో అమ్మ ఫర్నిచర్ మాల్ ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పోను తిలకిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి. ప్రక్కన అమ్మఫర్నీచర్ మాల్ అధినేతలు గడ్డం సుధాకర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, సుజన్‌రెడ్డి.

కిరణ్ పదవి పదిలం

మొదటి పేజీ కొరవ

దన్న భయం లేశమాత్రం లేదు. డిసెంబర్‌లో జరిగే గుజరాత్ ఎన్నికల వరకు ఆంధ్ర వ్యవహారాలలో వేలు పెట్టే తీరిక, ఓపిక కాంగ్రెస్ పెద్దలకు వుండ దన్నది పరిశీలకుల అంచనా. దానితో తన పదవిని మరింత పదిలం చేసుకోవడానికి మొదటిసారిగా ప్రయత్నం చేస్తున్నాడు ముఖ్యమంత్రి. అయితే ఢిల్లీలో వున్నంత సుఖంగా రాష్ట్రంలో పరిస్థితులు లేవు. మంత్రులలో సగం మంది పైగా ఆయనంటే మండిపడుతున్నారు. వారితో సఖ్యత కోసం ఆయన కూడా ప్రయత్నం చేయడం లేదు. అధికారులలో చాలా మంది ముఖ్యమంత్రికి సహకరించడానికి సిద్ధంగా లేరు. దానితో పరిపాలన కుంటి నడక నడుస్తున్నది. అదేమీ పట్టనట్లు వ్యవహరించడం ద్వారా ఈ వ్యతిరేకతలు ప్రచారం కాకుండా జాగ్రత్త పడుతున్నాడు. ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా వున్నాయి కాబట్టి, తన కాళ్ల క్రింద నీళ్లు పారించడానికి చూస్తున్న వారందరినీ కనిపెట్టి, పనిపట్టాలన్నది కిరణ్ ఆంతర్యంగా కన్పిస్తున్నది.

నామినేటెడ్ పదవుల పందారంతో అందుకు శ్రీకారం చుట్టబోతున్నాడని వినికిడి. ఆ పదవుల భర్తీకి సోనియాగాంధీ అనుమతి కూడా తీసుకొని వచ్చాడు. జిల్లాలలో తనకు గిట్టని మంత్రులు, కాంగ్రెస్‌వాదులకు చీకాకు సృష్టించగలవారిని ఎంపిక చేసి, ఈ పదవులు నింపాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అంటున్నారు. బొత్సా సత్తిబాబు, రఘువీరా రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, డిఎల్.రవీంద్రరెడ్డి వంటి వారందరికీ చేదు అనుభవాలు ఎదురు కాబోతున్నాయని చెప్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఒక ప్రబలమైన రాజకీయ శక్తిగా వున్న కెవిపి రామచంద్రరావును మచ్చిక చేసుకొని, ఈ శత్రు సంహారం చేయాలన్నది పథకం. అందుకోసమే కాబోలు కెవిపికి అత్యంత సన్నిహితుడైన సీతారామరాజు అనే వ్యక్తికి ఏపి సర్వీస్ కమిషన్ పదవి కట్టబెట్టాడు. కడప జిల్లాలో డిఎల్ పొడ గిట్టని తులసిరెడ్డికి మరొక పర్యాయం క్యాబినెట్ ర్యాంక్ పదవి కొనసాగించాడు. తతిమా పదవులతోనూ ఇటువంటి రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం ఖాయంగా కన్పిస్తున్నది.

మరొకప్రక్క గవర్నర్ మీద కారాలు మిరియాలు నూరుతున్నాడు కిరణ్ కుమార్‌రెడ్డి. సమాచార హక్కు కమిషనర్ల నియామకంలో మొదటి సారిగా గవర్నర్‌కు ఆయనకు పేచీ వచ్చింది. అడ్మిని స్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా దిలీప్‌రెడ్డి నియామకంలో మరొకసారి అది పునరావృత్తమైంది. ఇప్పుడు తాజాగా లోకాయుక్తగా సుభాషణ్‌రెడ్డి విషయంలోనూ అదే ఇబ్బంది ఎదురైంది. సుభాషణ్‌రెడ్డి నియామకం సాంప్రదాయ విరుద్ధమని గవర్నర్ అభ్యంతరం చెప్పినా విన్పించుకోకుండా పట్టుబట్టి మరీ దానిపై సంతకం పెట్టించాడు ముఖ్యమంత్రి. గవర్నర్ తనపై ఢిల్లీకి చాడీలు మోస్తున్నాడని, నివేదికలు పంపుతున్నాడని కిరణ్ అనుమానం. ఆ కోపంతోనే తిరుపతి నుంచి రావడానికి ప్రభుత్వ విమానం పంపమని గవర్నర్ చేసిన అభ్యర్థన తిరస్కరించి, అవమానించాడని చెప్తారు. ఆ ఉదంతం తర్వాత ఇద్దరి మధ్య దూరం బాగా పెరిగిపోయింది. అయినా సోనియాగాంధీ ఆశీస్సులు తనకున్నంత కాలం గవర్నర్ చేయగల్గింది ఏదీ లేదని నిబ్బరం ప్రదర్శిస్తున్నాడు ముఖ్యమంత్రి.

సోనియాగాంధీ దగ్గర మంత్రివర్గ విస్తరణకు అనుమతి తెచ్చుకోవడంలో మాత్రం ఆయన విఫలమైనాడు. దానికి గ్రీన్ సిగ్నల్ వచ్చి వుంటే తన ముందు తోకాడిస్తున్న చాలా మందికి రెడ్ సిగ్నల్ చూపేవాడినని ఆంతరంగికుల వద్ద వ్యక్తం చేశారాయన. అసలే తలవాచే సమస్యలతో సతమతమయ్యేటప్పుడు మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇచ్చి, కొత్త సమస్యలు తెచ్చుకోవడం ఎందుకని అధిష్టానం కిరణ్‌కు నో చెప్పింది.

మొత్తం మీద రానున్న రెండు నెలల కాలంలో ముఖ్యమంత్రిగా కిరణ్ ఒక కొత్త రూపంలో కన్పించనున్నాడని పరిశీలకుల అంచనా. ఇంతకాలం ఒదిగి ఒదిగి వుండిన ఆయన తనను చులకన చేసిన వారందరినీ ఒకపట్టు పడతాడని భావిస్తున్నారు.

మసి పులిమిన అల్లుడు

16వ పేజీ కొరవ

జత కలిసి కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం ఇప్పటికే గబ్బు పట్టి పోయింది. ప్రజలకు దానిపట్ల విశ్వాసం సన్నగిల్లింది. రేపటి ఎన్నికలలో ఈ ప్రజాగ్రహం కాంగ్రెస్‌ను ఏ పాతాళానికి దిగజారుస్తుందో వూహించడం కష్టం. రాబర్ట్ వాద్రా ఆ పుణ్యం కట్టుకొన్న చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడు.

రాజకీయ అవినీతికి పాల్పడిన వైఎస్ జగన్, ములాయం సింగ్ యాదవ్, మాయావతి, లల్లూప్రసాద్ యాదవ్, జయలలిత, కణిమొళి, సురేష్ కల్మాడి, మధుకోడా వంటి వారందరూ న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబడక తప్పలేదు. ఇదే సూత్రం రాబర్ట్ వాద్రాకు కూడా వర్తింప చేస్తే, సోనియాగాంధీకి పోయిన పరువు కొంతైనా నిలుస్తుంది. అల్లుడనే మమకారంతో అతడిని కాపాడడానికి, విచారణ జరపకుండా అడ్డుకోవడానికి ఏ చిన్న ప్రయత్నం చేసినా సోనియాగాంధీని జనం మరింత ఛీత్కరించడం ఖాయం.

జనవాణి

2వ పేజీ కొరవ

లేదు. ఆ కక్షతోనే వాళ్లు బాబును భ్రష్టు పట్టించారు. ఇప్పుడు చేస్తున్న పాదయాత్రతో చంద్రబాబుకు పూర్వపు ఇమేజ్ రావడం ఖాయం.

వాస్తు రామచంద్ర నెల్లూరు

ప్రకటనలకే పరిమితం

ఉచిత నిర్బంధ విద్య కల్పిస్తామంటున్న ప్రభుత్వ వాగ్దానాలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకు ఎన్ని నిధులు వెచ్చించినా అవి అమలు కావడం లేదు. విద్యార్థులకు పుస్తకాలు, బ్లాక్ బోర్డులు, బల్లలు, ప్లే గ్రౌండ్‌లు, టాయ్‌లెట్లు, మంచినీటి సదుపాయాలు, బట్టలు, పెన్నులు సరిగా అందడం లేదు. కొన్ని పాఠశాలలకైతే భవనాలే పకడ్బందీగా లేవు. పడిపోయే స్థితిలో చాలా ఉన్నాయి. విద్య కోసమంటూ పన్నులు వసూలు చేసి ప్రజలను పిప్పి చేస్తున్న ప్రభుత్వం ఈ నిధులను ఏం చేస్తుందో అర్థం కావడం లేదు.

షేక్ మునీర్ నెల్లూరు

ఉద్యమించవలసినవి చాలా ఉన్నాయి!

అంతా ఏకోన్ముఖంగా వినాయకుడి మీద దండెత్తుతున్నారు. రంగులు, రసాయనాలతో చేసిన వినాయకుడిని తరిమి కొట్టమంటున్నారు. మరి దీపావళి మాటేమిటి? ధనా ధన్ అనే శబ్దాలతో రోజంతా ధ్వని కాలుష్యం కావడం లేదా? ఆ టపాసుల నుంచి వచ్చే పొగలతో వాతావరణం కాలుష్యం కావడం లేదా? ఎన్ని అగ్నిప్రమాదాలు జరగడం లేదు? ఎంత మంది గుండె వ్యాధిగ్రస్తులు ఇబ్బంది పడడం లేదు. హిందూ సమాజంలో ఇటువంటి వ్యవహారాలు మమేకం అయిపోయాయి. ఈ వ్యవహారాలపై ఉద్యమాలు మాని అవినీతి అక్రమాలు, బహిరంగ మద్య సేవనం, లంచగొండితనం, స్వచ్ఛమైన పాలన, ఇసుక మాఫియాలు, ఆశ్రితపక్షపాతంపై ఉద్యమించాలి.

టి.కోటేశ్వరరావు కోవూరు

పద్ధతి మార్చుకోవాలి!

8వ పేజీ కొరవ

ప్రజాస్వామ్యప్రియులైన వారందరూ ప్రతిఘటిస్తారు. నియంతృత్వంగా నిందిస్తారు. పత్రికలను నిర్భందించే ప్రయత్నంలో ఇందిరమ్మ వంటి ధీరోదాత్త నేత సైతం విజయం సాధించలేదు. అందులోనూ ఒక ప్రాంతానికి చెందిన పత్రికల మీద వివక్ష ప్రదర్శించడం మరింత పెద్ద పొరపాటు.

రాష్ట్రంలో రాజకీయ వాతావరణం సంక్షుభితంగా వున్న సంక్లిష్ట సమయంలో దినేష్‌రెడ్డి గారు డిజిపి అయ్యారు. మామూలు కంటే మరింత అధిక సంయమనం, మరింత ఎక్కువ నిగ్రహం, మరింత అదనపు పెద్ద మనసులతో వ్యవహరిస్తేనే ఆ పదవికి వన్నె వస్తుంది. సంకుచిత వైఖరులతో తప్పులు చేస్తే మంచిపేరు చెడిపోతుంది.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

డెడ్ ప్రైవేట్ డిగ్రీ మరియు పిజి కళాశాలల యాజమాన్యాన సంఘం సర్వసభ్య సమావేశం 14వ తేది నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల్లో సంఘం అధ్యక్షునిగా శ్రీ చంద్రారెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కోటంరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఎన్నికయ్యారు.

జొన్నవాడలో శరన్నవరాత్రోత్సవాలు!

జొన్నవాడలోని శ్రీ మల్లిఖార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు 16వ తేది కలశస్థాపనతో ప్రారంభమయ్యాయి. 19వ తేది రాజరాజేశ్వరి అలంకారం, 20వ తేది సరస్వతి అలంకారం, 21వ తేది భండాసురవధ అలంకారం, 22వ తేది దుర్గా అలంకారం, 23వ తేది మహిషాసురమర్దిని అలంకారం, 24వ తేది విజయదశమిని పురస్కరించుకొని గ్రామోత్సవం, రాత్రి ఏకాంతసేవ జరుగుతాయి. ఈ దసరాలో పది రోజులపాటు ప్రతిరోజు సాయంత్రం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం కూడా జరుగుతుందని, అమ్మవారి భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని ఆలయ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి కోరుతున్నారు.

కరుణామయి జన్మదినం!

రాపూరు మండలం పెంచలకోనలో వెలసి ఉన్న లలితాంబికాదేవి మణిదీప మహాసంస్థానంలో దసరా ఉత్సవాలు 16వ తేది ప్రారంభమయ్యాయి. ఇవి అక్టోబర్ 24వ తేది వరకు జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతినిత్యం అపూర్వ నిత్యాభిషేకాలు, మహాశక్తివంతమైన హోమాలు, శతచండీ హోమాలు జరుగుతాయి. విజయదశమి పండుగ రోజే కరుణామయి అమ్మ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నప్రసాదంతోపాటు తీర్థప్రసాదాలు ఉచితంగా అందజేస్తారు.

ముత్యాలమ్మ దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలు!

తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలు 16వ తేది ప్రారంభమయ్యాయి. 19వ తేది అమ్మవారికి మోహినీ అలంకారం, 20వ తేది మహాలక్ష్మీదేవి, కాళికాదేవి అలంకారం, 21వ తేది సరస్వతిదేవి అలంకారం, 22వ తేది దుర్గాదేవి అలంకారం, 23వ తేది మహిషాసుర మర్దిని, 24వ తేది మహాత్రిపుర సుందరిదేవి అలంకారంతోపాటు పూలంగిసేవ జరుగుతాయి. వీటితోపాటు 24వ తేది విజయదశమిని పురస్కరించుకొని ఉదయం పది గంటలకు చండీసప్త శతీ హోమం, సాయంత్రం ఐదు గంటలకు సూక్త పారాయణం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయమంటున్నాడు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆవుల వెంకటేశ్వర్లు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వితరణ!

పారిశ్రామికవేత్త, వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు సెంట్రల్ జైలులో ఉపయోగార్థం లక్షా 22వేల రూపాయల విలువచేసే కంప్యూటర్లు, ప్రింటర్లు జైలు సూపరింటెండెంట్ రవికిరణ్‌కు అందజేశారు. ప్రతి ఏడాది ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా జిల్లా జైలుకు ఏదో ఒక ఉపకరణాలు అందజేయడం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అలవాటు.

క్యాన్సర్ ఆసుపత్రి వివరణ


నెల్లూరు పొదలకూరు రోడ్డులోని రెడ్‌క్రాస్ యాజమాన్యాన నడిచే క్యాన్సర్ ఆసుపత్రిపై అక్టోబర్ 5వ తేది 'జమీన్‌రైతు' సంచికలో వచ్చిన వార్తపై ఆ ఆసుపత్రి కన్వీనర్ తుంగా ప్రసాద్‌రెడ్డి వివరణ పంపారు. క్యాన్సర్ ఆసుపత్రిలో ప్రస్తుతం తీసుకుంటున్న డాక్టర్ల కన్సల్టేషన్ ఫీజు, రక్తపరీక్ష, స్కానింగ్ ఫీజులు నగరంలో మిగతా ఆసుపత్రులతో పోల్చుకుంటే నామమాత్రమన్నారు. వాస్తవానికి క్యాన్సర్ ఆసుపత్రులలో అన్ని రకాల ఫీజులు ఎక్కువగా ఉంటాయని కానీ నెల్లూరులో తక్కువని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది కూడా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని వివరించారు.

డాక్టర్ రవికి పితృవియోగం

నెల్లూరు పొగతోటలో మంచి హస్తవాసిగల చిన్న పిల్లల డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ టి.రవికుమార్ తండ్రి తెనాలి గురుమూర్తి(85) కలిచేడులో 12వ తేది మరణించారు. గురుమూర్తి కలిచేడులో రైతు కుటుంబీకుడు. గ్రామంలో స్వంత డబ్బుతో శివాలయం కట్టించిన శివభక్తుడు. డాక్టర్ రవిగాక ఇద్దరు కుమార్తెలు గురుమూర్తికి ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన డాక్టర్ రవికి మా సానుభూతి.

పదరంగం -38

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. గుర్తు (5)
3. ప్రాచీన హిందీ కవి (3)
6. విజిల్ (2)
8. తపస్సు చేయువారు (3)
10. అటునుంచి నగర పాలకుడు (3)
11. రిక్షా నడుపువాడు (4)
13. శ్రేయస్సు (2)
14. మన్మథుని భార్య (2)
16. కెవ్వున అరవడం (2)
17. అటునుంచి తెలుగు రీజన్ (3)
22. గడుసు దనం గలవాడు (4)
24. వైశాలి రాజ్య ఆస్థాన నర్తకి (4)
26. రచించబడినది (3)
27. ప్రస్తుతం కాలం పేరు (2)
28. దండోరా (3)
29. కల్పాంత విధ్వంసం (3)
31. అటునుంచి వీడు కాదు (2)
33. చాటు (3)
35. రాజుగారి భార్య (2)
36. గాడిద (2)
39. మయూరాలు (3)
40. పారతో పాటే గుంటను త్రవ్వేది (3)
41. చీకటి, యామిని (3)

నిలువు

1. అల్లరివాడు (4)
2. తెలుగు అట్మాస్పియర్ (5)
4. అల్మారా (3)
5. క్రింద నుంచి వకీలు (3)
7. చెట్ల తీగలు (3)
9. శ్రీ (2)
12. కరువు (2)
13. మేషము (2)
15. పాతకాలపు గ్రైండరు (4)
16. సింహము (3)
18. పుష్పవృంతము (2)
19. తెలుగు ఇంట్రడక్షన్ (4)
20. ఇంటి గడప (3)
21. రాగి (3)
23. సరళంగా గీచిన గీతలు (6)
24. గేమ్ (2)
25. జారుడు బండలు (5)
30. తిరుమల క్రిందనున్న పట్టణం (4)
32. వాక్కు, సరస్వతిదేవి (2)
34. హనీ
37. కలరు (2)
38. మిరపకాయ రుచి (2)

సమాధానాలు

పదరంగం -37

1ప్ర	వ	2ర్ధ	3మా	4నం		5భా	6వి	త	రా	7లు
యో		8అ	వ	మా	9నం		లా			తో
10జ	11నం		టి		12తా	ప	సి			
13నం	ది		14వా	య	సం		15ని	16జం		17న
	18వ	రు	డు			19అ		20తి	21ల	లు
	ర్ద			22కా	23మా	క్షి		24క	లు	గు
25పా	నం	వ		26సా	రు		27వు	లు	ప	రు
			28గా	రం	తి				వె	
29డు	30గా	మా	య			31పా	వ	32నం		
	య		కు		33కా	య		34న	చ	వం
	ని		డు		35లం	సం	ధ్యా	కా		

సంక్షిప్త సింహపురి

జర్నలిస్ట్ కుటుంబాలకు సాంస్కృతిక పోటీలు!

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా శాఖ నేతృత్వంలో ఈ నెల 28వ తేది నెల్లూరులో జర్నలిస్ట్ కుటుంబాలకు సాంస్కృతిక పోటీలు నిర్వహింప తలపెట్టింది. ఆ రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పిల్లల కోసం భరతనాట్యం, మిమిక్రీ, పెద్దలకు క్విజ్ కార్యక్రమాలు జరుగుతాయి. హాస్యవల్లరి కార్యక్రమం కూడా ఉంటుంది. పోటీల్లో పాల్గొనదలచిన వారు పేర్లు ప్రెస్ క్లబ్‌లో నమోదు చేయించుకోవాలని, ఇతర వివరాలకు 7799360006, 9963827227 ఫోన్ నెంబర్లలో అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఛాంపియన్ డికెడబ్ల్యు కాలేజి!



విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలో డికెడబ్ల్యు డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన అంతర్ కళాశాలల మహిళల క్రీడాపోటీల్లో డికెడబ్ల్యు కాలేజి జట్టు 70 పాయింట్లు సాధించి ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకొంది. బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో జగన్స్ ప్రధమ, డికెడబ్ల్యు ద్వితీయ, డబుల్స్‌లో డికెడబ్ల్యు ప్రధమ, జగన్స్ కాలేజి ద్వితీయ స్థానాలను సాధించాయి. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో డికెడబ్ల్యు ప్రధమ, కావలి జవహర్‌భారతి ద్వితీయ, డబుల్స్‌లో కావలి జవహర్‌భారతి ప్రధమ, డికెడబ్ల్యు ద్వితీయ స్థానాలు సాధించాయి. టెన్ని కాయిట్ డబుల్స్‌లో వింజమూరు ఎంఎస్ఆర్ కళాశాల ప్రధమ, డికెడబ్ల్యు ద్వితీయ, వాలీబాల్‌లో జవహర్‌భారతి ప్రధమ, డికెడబ్ల్యు ద్వితీయ, బాస్కెట్‌బాల్‌లో విఆర్‌సి ప్రధమ, కావలి జవహర్‌భారతి ద్వితీయ స్థానాలను సాధించాయి. కబడ్డీలో విఆర్‌సి ప్రధమ, డికెడబ్ల్యు ద్వితీయ స్థానాలు సాధించాయి. విజేతలకు డిఆర్ ఉత్తమ హోటల్ అధినేత ధనుంజయరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డికెడబ్ల్యు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శారదాదేవి, వివిఎస్‌యూ స్పోర్ట్ బోర్డు కార్యదర్శి చంద్రమోహన్, ఫిజికల్ డైరక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దందా

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను తీసుకొచ్చి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొంటూ పలువురు ఇసుక దందాకు పాల్పడుతున్నారని నెల్లూరు కార్పొరేషన్ మాజీ ఉప మేయర్ మాదాల వెంకటేశ్వర్లు విమర్శించారు. వేదాయపాళెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల కనుసన్నల్లో పలువురు ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను చేరుస్తున్నామంటూ బోగస్ రశీదులు పొంది ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో వేల రూపాయలకు విక్రయిస్తున్నారన్నారు. ఒకే వే బిల్లుతో రోజుకు పది నుంచి పన్నెండు ట్రక్కుల ఇసుకను తరలిస్తూ భూ బకాసురులు వారి చేతివాటాన్ని చూపుతున్నారన్నారు. ఇందులో అధికారులు సైతం తమ వంతు అన్నట్లు అవినీతికి పాల్పడుతూ బ్లాక్ మార్కెట్‌కు సహాయపడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్యూబిక్ మీటరు ఇసుక 325 రుపాయలకే అందిస్తామన్న ప్రభుత్వం మాటలు కాగితాలకే పరిమిత మయ్యాయని, ఈ వ్యవహారంలో జిల్లా అధికారులు స్పందించకపోతే ఉద్యమ బాట పడతామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు.


ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు రంగనాయకుల పేటలోని పెద్ద తోటలో ఎన్.ఎం.డి చారిటీస్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. నారాయణ జనరల్ హాస్పిటల్‌లోని న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ 60 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూరోఫిజియో థెరపిస్ట్ డాక్టర్ షహనాజ్ కూడా పాల్గొని ఫిజియో థెరపీ అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ స్టిబిలేట్ చికిత్స చేశారు. ట్రస్ట్ సభ్యులు సయ్యద్ పాషా మొహిద్దీన్, షేక్ ఆరిఫ్, సయ్యద్ మంజూర్ అలీ, సయ్యద్ అష్టల్, ఖలీద్ శిబిరం విజయవంతమయ్యేందుకు తమ వంతు సహకారం అందించారు.

12వేల మంది ఎస్టీలకు ఉద్యోగాలు!

జిల్లాలో ఎస్టీ నిరుద్యోగులను గుర్తించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ పిడి వి.వెంకటసుబ్బయ్య అధికారులను ఆదేశించారు. డిఆర్‌డిఏ కార్యాలయంలో జాబ్స్ విభాగం అధికారులు, ట్రైనింగ్ పార్టనర్లతో నిర్వహించిన సమావేశంలో పిడి మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 12వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటివరకు రెండు వేల మందికి ఉపాధి కల్పించామన్నారు. ఉద్యోగ మేళా నిర్వహించే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయా కార్పొరేషన్ల ఆధ్వర్యంలో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఉద్యోగ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



రైతు లోకం

రబీలో వరినాట్లు - మెళకువలు!

మన జిల్లాలో సాధారణంగా రబీ వరినాట్లు నవంబరు నెలలో ప్రారంభమవుతాయి. వరినాట్లకు ముందు ఈ దిగువ మెళకువలు పాటిస్తే మంచిది.

నాట్లు వేయటానికి 15రోజుల ముందు పొలాన్ని దమ్ము చేయుట ప్రారంభించి 2,3 దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొల మంతా సమానంగా దమ్ము చెక్కతోగానీ, అడ్డతోగానీ చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయటానికి 2రోజుల ముందుగానే దమ్ము పూర్తి చేసి, ఆ తరువాతనే నాట్లు వేస్తే మంచిది.

నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకు పచ్చగా వుంటేనే మూన త్వరగా తిరుగుతుంది. నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి. ముదురు నారును నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు పైపైన నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం వుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

రబీలో 44 మూనలు వుండేలా చూడాలి. నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20సె.మీ. బాటలు తీయడం వలన పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు. ఎరువులు, పురుగుమందులు, కలుపు మందులు వేయటానికి మరియు పైరు పరిస్థితిని గమనించటానికి ఈ బాటలు బాగా ఉపయోగపడతాయి.


భూసారం ఎక్కువ వున్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, భూసారం తక్కువగా వున్న పొలాల్లో ఎక్కువ కుదుళ్లు వుండేట్లు నాటాలి. ముదురు నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు 4,5 మొక్కల చొప్పున నాట్లు వేయాలి. అలా ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25% పెంచి 3 దఫాలుగా గాక, 2 దఫాలుగా అంటే 70 శాతం దమ్ములోనూ మిగతా 30శాతం అంకురం దశలోనూ వాడాలి.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

గాంధీ కుటుంబం మీద

చెరపలేని అవినీతి మసి పులిమిన అల్లుడు!

● రాబర్ట్ వాద్రా గిల్లుడుతో ఇబ్బందుల్లో కాంగ్రెస్ పార్టీ.



రాజీవ్‌గాంధీ వంటి జన సమ్మోహనా శక్తి కల్గిన జాతి నేత – తుక్కు 64 కోట్ల రూపాయల బోఫోర్స్ కమీషన్ల వ్యవహారంతో జాతి ద్రోహిగా చరిత్ర ఛీత్కారం ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పుడదే కుటుంబానికి చెందిన రాబర్ట్ వాద్రా డిఎల్ఎఫ్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ ఆస్తులు కూడగట్టుకొని ఆ కుటుంబం మీద చెరపలేని అవినీతి మసి పులిమాడు. కేవలం ప్రతిపక్షాలు వేసిన నీలాపనిందలకు రాజీవ్‌గాంధీ ప్రతిష్ట బుగ్గిపాలైపోయింది. కానీ రాబర్ట్ వాద్రా మీద మోపిన అభియోగాలు నిందలు కావు, పచ్చి నిజాలు.

అవినీతిపై యుద్ధం అక్కడే ఆరంభం!


అవినీతి చెద పురుగు రాజకీయ వ్యవస్థలో ప్రవేశిస్తే దేశానికి ఎంత నష్టమో స్వాతంత్ర్యం వచ్చిన తొలి దినాలలోనే గ్రహించి, దాని నిర్మూలనకు కంకణం కట్టుకొన్న ప్రథమ భారతీయ రాజకీయవాది – ఫిరోజ్ గాంధీ. ఇందిరమ్మను ప్రేమించి పెళ్లాడిన ఆయన నెహ్రూ ప్రభుత్వంలో జరిగే ప్రతి చిన్న తప్పునూ పార్లమెంట్‌లో తూర్పార పట్టేవాడు. ఒక్కొక్కసారి నెహ్రూ అంతటివాడు కూడా ఫిరోజ్‌గాంధీ విమర్శలకు తల్లడిల్లిపోయేవాడు. భారతదేశంలో ప్రథమ అవినీతి ఘటనగా ప్రసిద్ధి చెందిన హందాసంద్రా–2సి కుంభకోణాన్ని వెలికి తీసింది ఆయనే. దాని ఫలితమే ఆనాటి ఆర్థిక మంత్రి టిటి.కృష్ణమాచారి తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. అంటే, ఇప్పుడు అన్నా హజారే, కేజ్రీవాల్ వంటి వ్యక్తులు గొప్పగా చెప్పుకొంటున్న అవినీతిపై యుద్ధం – ఆ కుటుంబం నుంచే ప్రారంభమైందన్న మాట.

ప్రియాంక గాంధీని పెళ్లాడే వరకు వాద్రా అతి సామాన్య కుటుంబీకుడు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాదులో చిన్నపాటి ఇత్తడి సామాన్ల వ్యాపారం మాత్రమే వుండేది వారికి. అది కూడా సక్రమంగా నడవక ఇబ్బందిపడే వారు. ప్రియాంకతో పెళ్లి అతడి జీవిత గతి మార్చింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన రాజకీయ కుటుంబంలో స్థానం దక్కింది. అయితే ఆ కుటుంబ వారసత్వానికి ఏ విధమైన అర్హత లేదు వాద్రాలో. నాలుగు తరాలుగా నిరాడంబరతకు, ప్రజాసేవకు పేరుపడిన కుటుంబం సాంప్రదాయాలకు భిన్నంగా విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడతడు. అయితే దాదాపు పదేళ్లపాటు వాద్రా రాజకీయాలలో వేలు పెట్టకుండా నియంత్రించింది సోనియాగాంధీ. కానీ 2007 నుంచి ఆమె అదుపు తప్పింది. పొరుగునే వున్న హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలలోని కాంగ్రెస్ ముఖ్యమంత్రులను మచ్చిక చేసుకొని స్వంత ఆర్జన మొదలు పెట్టాడు. కేంద్ర మంత్రులకు కూడా పైరవీ సిఫార్సులు చేయడం మొదలు పెట్టాడు. దీనిపై ఢిల్లీ కార్పొరేట్ కంపెనీ వర్గాలలో వదంతులు విన్పించేవి తప్ప పెద్దగా బయటపడి ప్రజల చర్చకు రాలేదు. అన్నా హజారే బృంద సభ్యుడు కేజ్రీవాల్ ఇప్పుడా పాపాల పుట్ట పగల గొట్టాడు. రాబర్ట్ వాద్రా ఎంత సులువైన మార్గంలో వందల కోట్ల రూపాయల ఆస్తులకు అధిపతి అయ్యిందీ కనిపెట్టి, లోకానికి వెల్లడించాడు.

రాబర్ట్ వాద్రా అక్రమ ఆర్జనకు దేశంలోని అతి పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డిఎల్ఎఫ్ తన పూర్తి సహకారం అందజేసింది. ఆ కంపెనీ వ్యాపారానికి కేంద్ర స్థానం – ఢిల్లీ శివారులలోని గుర్గాం ప్రాంతం. అది హర్యానా రాష్ట్రంలో భాగం. అక్కడ కొన్ని వేల ఎకరాల భూములను స్వంతం చేసుకొని, అంతర్జాతీయ స్థాయిలో భవనాలు నిర్మిస్తుందా సంస్థ. వారికి హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రులతో నిత్య అవసరాలుంటాయి. అందుకోసం వారు రాబర్ట్ వాద్రాకు గాలం వేశారు. సోనియాగాంధీ అల్లుడిగా ఆయన పలుకుబడిని వినియోగించి హర్యానా రాష్ట్రం నుంచి పలు ప్రయోజనాలు పొందారు. అందుకు ప్రతిఫలంగా వాద్రాకు పెద్ద పెద్ద మొత్తాలలో అప్పులిచ్చి, భూములు కొనిపించి, వాటిని తిరిగి తామే కొనుగోలు చేయించారు. ఈ లావాదేవీలలో వాద్రాకు కోట్లాది రూపాయల లాభం చేకూరింది. దాన్ని పెట్టుబడిగా పెట్టి ఆయన మరిన్ని ఆస్తులు సమకూర్చుకొన్నారు. పైకి చూడడానికి ఇందులో చట్ట విరుద్ధమైనది ఏదీ కన్పించదు. భూముల కొనుగోలుకు రియల్ ఎస్టేట్ కంపెనీలు అడ్వాన్సులు ఇవ్వడం, అడ్వాన్స్ తీసుకొన్న బ్రోకర్ల ద్వారా కొనుగోళ్లు జరపడం చట్టబద్ధమైన కార్యక్రమమే. అయితే రాబర్ట్ వాద్రా సాధారణ బ్రోకర్ కాడు. దేశాన్ని పాలించే కుటుంబానికి అల్లుడు. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఆ గుమ్మం ముందు పడిగాపులు కాస్తున్నారు. కాలితో చెప్తే చేతితో పనులు చేసి పెట్టడానికి సిద్ధంగా వుంటారు. ఆ అధికార పీఠాన్ని తనకనుకూలంగా మలచుకోవడానికి రాబర్ట్ వాద్రాను ఒక కీలు బొమ్మగా వాడుకొన్నది డిఎల్ఎఫ్ సంస్థ.

వ్యాపారం చేసుకొనే వారు తమ పనుల కోసం ఎవరినైనా ఆశ్రయిస్తారు. అది డిఎల్ఎఫ్ తప్పు కాదు. కానీ ప్రజాదరణ అనే అనంతకోటి సంపద కల్గిన కుటుంబంలోని వ్యక్తులు ఇటువంటి ప్రలోభాలకు లోబడడం, ఆస్తుల కోసం దురాశకు లోనుకావడం ఖచ్చితంగా తప్పే, ఆ తప్పు చేసిన వాద్రా ప్రజా న్యాయస్థానంలో నిందితుడి క్రిందే లెక్క. అయితే ఇక్కడ నేరం చేసింది ఆయన అయినా శిక్ష మాత్రం మొత్తం కాంగ్రెస్ పార్టీకి వర్తిస్తుంది. వాద్రా వంటి ఆషాఢభూతులను నియంత్రించలేని తప్పిదానికి సోనియాగాంధీ కుటుంబం మొత్తం దేశ ప్రజల ముందు దోషిగా నిలబడక తప్పదు. చేశాడో చేయలేదో తెలియని బోఫోర్స్ నేరానికి రాజీవ్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా పెద్ద శిక్ష అనుభవించింది. తిరుగులేని శక్తిగా వుండిన కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వాలను నడుపుకోవాల్సిన దుర్గతికి కారణం – బోఫోర్స్ వివాదమే. ఇప్పుడు రాబర్ట్ వాద్రా తప్పులు కాంగ్రెస్‌ను శాశ్వతంగా రాజకీయ భూస్థాపితానికి గురి చేసే ప్రమాదం కన్పిస్తున్నది. ఆర్థిక సంస్కరణల పేరిట సామాన్యుడి నడ్డి విరిచే విధానాలు అమలు చేయడం ఒకపక్క, సంకీర్ణపార్టీల అవినీతిని నిరోధించలేని అసహాయత మరొక ప్రక్క

కొరవ 14వ పేజీలో



వాద్రా ఆస్తుల పట్టిక

స్టైలైట్ హాస్పిటాలిటీ:
హిల్టన్ గార్డెన్ హోటల్‌లో 50శాతం వాటా
విలువ 32 కోట్ల రూపాయలు.

స్టైలైట్ రియాల్టీ:
గుర్గాంలోని విలాసవంతమైన అరలియస్‌లో 10వేల చదరపుటడుగుల విల్లా.
విలువ 10 కోట్ల రూపాయలు.
డిఎల్ఎఫ్ క్యాపిటల్ గ్రీన్స్ అనే భవంతిలో 15 ఫ్లాట్లు.
విలువ 5 కోట్ల రూపాయలు.
డిఎల్ఎఫ్ మగ్నోలియ భవంతిలో 7 ఫ్లాట్లు.
విలువ 5 కోట్ల రూపాయలు.

రియల్ ఎర్త్ ఎస్టేట్స్:
గ్రిసియర్ కైలాష్‌లో ఫ్లాట్ విలువ కోటి రూపాయలు.

నార్త్ ఇండియన్ ఐటి పార్క్:
రాజస్థాన్‌లోని బికనీర్‌లో 161 ఎకరాలు.
విలువ కోటి రూపాయలు.

వ్యవసాయ భూములు:
రాజస్థాన్‌లోని బికనీర్‌లో మూడు చోట్ల పదెకరాలు, హర్యానాలోని మేవాట్, హయత్‌పూర్, హసన్‌పూర్‌లలో భూములు.
విలువ దాదాపు 35 కోట్ల రూపాయలు.

ఆస్తులు లేని ఆదర్శ కుటుంబం

పంచాయితీ సర్పంచ్‌గా గెలిచినవాడు కూడా నాలుగైదు తరాలకు సరిపడా మూట కట్టుకోవడం రాజకీయ ధర్మమని భావించడం మన దేశంలో ఆనవాయితీ. కానీ ఒకరికి ముగ్గురు ప్రధానులను అందించిన నెహ్రూ – ఇందిర కుటుంబానికి స్వంతం అని చెప్పుకోవడానికి వీసమెత్తు ఆస్తి లేదు. అట్లని వారు నిరుపేదలు కారు. వారి వంశంలో ప్రథమంగా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నిర్వహించిన మోతీలాల్ నెహ్రూ వందేళ్ల క్రితమే ఇంగ్లాండ్‌లోని ప్రైవీ కౌన్సిల్‌లో వాదించడానికి అర్హత పొందిన ప్రసిద్ధ న్యాయవాది. ఆయన సంపద రాజకుటుంబాలకు ధీటుగా వుండేది. ఆయన కుమారుడైన జవహర్‌లాల్ నెహ్రూ దాన్నంతటినీ దేశానికి ధారాదత్తం చేశాడు. ఆయన కుమార్తె ఇందిరమ్మ తన తండ్రి తనకిచ్చిన అలహాబాదులోని రాజభవంతి వంటి ఆనంద నిలయాన్ని కూడా జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి ఆమెకు కానీ, ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ, కోడలు సోనియాగాంధీకి కానీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ఆస్తి. తమకంటూ వారికి ఒక్క ఎకరా పొలం లేదు. ఇల్లు లేదు. వ్యాపారం లేదు. ఇతర ఆస్తులు ఏవీ లేవు. ప్రభుత్వం ఇచ్చే బంగళాలోనే నివాసం. స్వంత కారు కూడా లేదు. కుటుంబ ఖర్చులన్నీ పార్టీ పద్దులోనే. తరాల తరబడి దేశాధిపత్యం సిద్ధించుకొంటున్నా పొరపాటున కూడా స్వంత ఆస్తి అంటూ ఏదీ ఏర్పరచుకోలేదు. నిరాడంబరంగా బ్రతకడంలో వారికి సాటి రాగలవారు వర్తమానంలో మరొకరు లేరు. రాజీవ్‌గాంధీ, సంజయ్‌గాంధీల పెళ్లిళ్లకు ఇందిరమ్మ పిలిచిన అతిథుల సంఖ్య ఐదంటే ఐదే, వారి జీవితంలో ఆడంబరాలకు ఎంత దూరమో అర్థం చేసుకోవచ్చు. కోట్లాది ప్రజల ఆదరాభిమానాలనే అనంతమైన ఆస్తి కంటే, అపార్ట్‌మెంట్ భవనాలు, హోటల్ గదులు అధికమని నమ్మే నీచ వ్యక్తిత్వం కల్గిన ప్రబుద్ధుడు ఒకడు వారి కుటుంబంలో సభ్యుడు కావడం చాలా దురదృష్టకరం.

Imported & Indian Furniture
మా ప్రత్యేకత
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
ఆదివారం కూడా షాపు తెరవబడును.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com